నేడు తోటపల్లి నీరు విడుదల

గరుగుబిల్లి, జూన్ 27: ఖరీఫ్ కోసం తోటపల్లి భారీ సాగునీటి ప్రాజెక్టు పరిధిలోని కుడి ప్రధాన కాలువ నుంచి శుక్రవారం సాగునీటిని విడుదల చేయనున్నారు. మంత్రి గుమ్మిడి సంధ్యారాణి, కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి హాజరై సాగునీటిని విడుదల చేస్తారని ప్రాజెక్టు అధికారులు తెలిపారు. కుడి ప్రధాన కాలువ పరిధిలో పార్వతీపురం, బొబ్బిలి, చీపురుపల్లి, నెల్లిమర్ల, రాజాం, ఎచ్చెర్ల నియోజకవర్గాలు ఉన్నాయి. వీటి పరిధిలోని 133 గ్రామాలకు సంబంధించి సుమారు 85 వేల ఎకరాలకు సాగునీరు అందించేందుకు ప్రాజెక్టు అధికారులు అవసరమైన చర్యలు చేపట్టారు.

జిల్లాలో విస్తారంగా వర్షాలు

- పాచిపెంటలో కోతకు గురైన కుమ్మరిగెడ్డ గట్టు
- ఇళ్లలోకి చేరిన వరద
- కొమరాడలో నారుమడుల్లో నిలిచిన నీరు


పాచిపెంట: మేదర వీధిలో ఇళ్లలోకి చేరిన కుమ్మరిగెడ్డ నీరు


భామిని నాయుడు వీధిలో ప్రవహిస్తున్న మురుగు

పార్వతీపురం రూరల్/ కొమరాడ/ భామిని/ పాచిపెంట, జూన్ 27: జిల్లాలో గత రెండు రోజులుగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. పార్వతీపురం, కొమరాడ, భామిని, పాచిపెంట, తదితర మండలాల్లో భారీ వర్షాలు పడుతున్నా యి. గురువారం కురిసిన వర్షానికి పాచిపెంట బైపాస్ రోడ్డు పక్కన ఉన్న కుమ్మరిగెడ్డ గట్టు కోతకు గురైంది. దీంతో కుమ్మరిగెడ్డ వరద నీరంతా బైపాస్ రోడ్డుకు ఆనుకుని ఉన్న మేదరవీధి కాలనీలోనికి చేరింది. కొంతమంది ఇళ్లలోకి కూడా నీరు ప్రవేశించడంతో కాలనీవాసులు అనేక ఇబ్బందులు పడ్డారు. కుమ్మరిగెడ్డ ద్వారా గ్రామ సమీపంలోని రాతి చెరువు, ఊర చెరువుల్లోకి నీరు చేరేది. అయితే గత మూడేళ్లుగా ఉపాధి హామీ పథకం ద్వారా కుమ్మరిగెడ్డ పనులు చేపట్టలేదు. కుమ్మరిగెడ్డ కాలువ పూర్తిగా పూడికపోయి తుప్పలతో నిండి ఉంది. వర్షా కాలంలో గెడ్డ నీరు ప్రవాహానికి దారి లేక గట్టు కోతకు గురై కాలనీవాసులను ఇబ్బందులు పెడుతున్నాయి.

సంబంధిత అధికారులు స్పందించి కుమ్మరిగెడ్డ కాలువ ఎర్త్ వర్కుతో పాటు రాతి రివిట్‌మెంట్ చేయాలని, నీరు చేరిన కాలనీవాసులతో పాటు రైతులు కూడా కోరుతున్నారు. అలాగే, కొమరాడ గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు నారుమడుల్లో నీరు చేరింది. దీనివల్ల మొలకలు దెబ్బతినే అవకాశం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. భామిని మండలం నాయుడు వీధిలో కాలువలు పూడికపోవడంతో గురువారం సాయంత్రం కురిసిన వర్షానికి ఆ ప్రాంతం మురుగుతో నిండిపోయింది. కాగా, వర్షాలతో వ్యవసాయ పనులు చేసేందుకు రైతులు సిద్ధమవుతున్నారు. నారు పోసుకునేందుకు, ఎదలు చల్లుకునేందుకు అనుకూలంగా ఉంటుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఎరువులు కోసం ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నామని, అటువంటి పరిస్థితి లేకుండా టీడీపీ కూటమి ప్రభుత్వంలో ఉండదని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.


కొమరాడ: నారుమడుల్లో నిలిచిపోయిన వర్షపు నీరు

ఏసీబీ వలలో పంచాయతీ కార్యదర్శి

- బిల్లులు చేసేందుకు రూ.20 వేలు డిమాండ్
- అవినీతి నిరోధక శాఖను ఆశ్రయించిన బాధితుడు
- రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్న ఇన్‌చార్జి డీఎస్పీ


వివరాలు వెల్లడిస్తున్న ఏసీబీ డీఎస్పీ, పక్కన పంచాయతీ కార్యదర్శి తిరుపతినాయుడు (ఎరుపు గడుల చొక్కా)

గరుగుబిల్లి, జూన్ 27: మండలంలోని రావివలస సచివాలయ పరిధిలోని లఖనాపురం గ్రామ పంచాయతీ కార్యదర్శి అల్లు తిరుపతినాయుడు గురువారం ఏసీబీ వలకు చిక్కాడు. ఇందుకు సంబంధించి ఉమ్మడి జిల్లా ఏసీబీ ఇన్‌చార్జి డీఎస్పీ బీవీఎస్ఎస్ రమణమూర్తి వివరాలు వెల్లడించారు. ఆయన సమాచారం ప్రకారం.. లఖనాపురం పంచాయతీ పరిధిలో చేపట్టిన వివిధ పనులకు సంబంధించి బిల్లులు చేయాలని సర్పంచ్ దూసి చిట్టెమ్మ, ఆమె కుమారుడు దూసి తిరుపతిరావు పంచాయతీ కార్యదర్శి తిరుపతినాయుడును కోరారు. బిల్లులు చేయాలంటే రూ.20 వేలు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. లంచం ఇవ్వలేని స్థితిలో ఉన్న తిరుపతిరావు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. వారి సలహా మేరకు తిరుపతిరావు గురువారం కార్యదర్శికి రూ.20 వేలు లంచం ఇస్తుండగా అప్పటికే అక్కడ మాటు వేసి ఉన్న ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. కేసు నమోదు చేసి తదుపరి చర్యలు నిమిత్తం విశాఖపట్నం ఏసీబీ కోర్టుకు తరలిస్తున్నామని డీఎస్పీ రమణమూర్తి తెలిపారు.

ఏసీబీ దాడులతో అధికారుల్లో వణుకు..

మండలంలో ఏసీబీ చేస్తున్న దాడులతో అధికారులు వణికిపోతున్నారు. ఇప్పటి వరకు అవినీతి నిరోధకశాఖ చేసిన దాడుల సంఖ్య ఐదుకు చేరుకుంది. మొదటిసారి రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ తిరుపతిరావు, రెండోసారి గృహ నిర్మాణశాఖ వర్క్ ఇన్‌స్పెక్టర్ ఎం.గణపతిరావు, మూడో దఫా విద్యుత్‌శాఖ ఏఈ గోవిందరావు, నాల్గోదఫా నాగూరు వీఆర్వో నాగేశ్వరరావు పట్టుబడ్డారు. తాజాగా గురువారం ఐదుసారి చేసిన దాడుల్లో లఖనాపురం గ్రామ పంచాయతీ కార్యదర్శి అల్లు తిరుపతినాయుడు ఏసీబీకి చిక్కాడు.


కలెక్టర్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతున్న మంత్రి సంధ్యారాణి

గిరిజన గ్రామాలకు ఫీడర్ అంబులెన్స్‌లు

- డోలీల మోత ఎక్కడా ఉండకూడదు
- శివారు భూములకు సాగునీరు అందిస్తాం
- ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలి
- మంత్రి సంధ్యారాణి

పార్వతీపురం, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): గిరిజన గ్రామాలకు ఫీడర్ అంబులెన్స్‌లు ఏర్పాటు చేస్తామని మహిళా శిశు, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. కలెక్టర్ కార్యాలయంలో గురువారం జిల్లా అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రజాప్రతినిధులు, అధికార యంత్రాంగం సమన్వయంతో పనిచేసి జిల్లాను అభివృద్ధి పథంలో నడిపించాలని కోరారు. 'త్వరలో ఐటీడీఏ పాలకమండలి సమావేశం నిర్వహిస్తాం. రైతులు అడిగిన విత్తనాలు, ఎరువులు సకాలంలో అందించాలి. పంట కొనుగోలు కేంద్రాలు సక్రమంగా పనిచేయాలి. మరమ్మతులకు గురైన అంబులెన్స్‌లను వెంటనే బాగు చేయించాలి. డోలీ పరిస్థితి ఎక్కడా ఉండకుండా చర్యలు చేపట్టాలి. మందులు, వైద్యం అందక ప్రజలు మరణించే పరిస్థితి ఉండరాదు. అవసరమైన రహదారులపై దృష్టిసారించాలి. అంగన్‌వాడీ కేంద్రాలకు నాణ్యమైన గుడ్లు, పాలు సరఫరా చేయాలి. బాల్య వివాహాల నియంత్రణకు చర్యలు తీసుకోవాలి. గిరిజన సంక్షేమ, ఆశ్రమ వసతి గృహాల్లో విద్యార్థులకు దుప్పట్లు, కంచాలు, గ్లాసులు, పుస్తకాలు అందించాలి. ప్రతి మారుమూల గ్రామానికి ముఖ్యంగా గిరిశిఖర గ్రామాల్లో తాగునీరు అందాలి. జగనన్న ఇళ్ల నిర్మాణాలు, లేఅవుట్ స్థలాలపై నివేదిక సమర్పించాలి. అక్రమాలు జరిగినట్లు తేలితే చర్యలు తీసుకుంటాం. పారాది కాజ్‌వే కొట్టుకుపోవడంతో సాలూరు లారీలకు మక్కువ మీదుగా వెళ్లడానికి అవకాశం కల్పించాలి. తోటపల్లి ఆధునికీకరణ పనులను వైసీపీ సర్కారు నిర్లక్ష్యం చేసింది. జపాన్ నిధులతో చేపట్టాల్సిన ఈ పనులు 20 శాతం కూడా జరగలేదు. ఈ నిధులను దారి మళ్లించారు. దీనిపై ప్రత్యేక దృష్టి సారిస్తాం. ప్రాజెక్టుల ప్రాంతంలో జంగిల్ క్లియరెన్స్ తదితర పనులు చేపడతాం. శుక్రవారం తోటపల్లి నీరు విడుదల చేసేందుకు ప్రయత్నిస్తాం. శివారు భూముల వరకు సాగునీరు అందిస్తాం. రైతు భరోసా కేం ద్రాల్లో ఖాళీగా ఉన్న వ్యవసాయ సహాయకుల పోస్టుల భర్తీకి చర్యలు తీసుకోవాలి. ప్రభుత్వ లోగో ఉన్న పట్టాదారు పాస్ పుస్తకాలు మాత్రమే రైతులకు అందించాలి' అని మంత్రి సంధ్యారాణి స్పష్టం చేశారు.

- పార్వతీపురం శాసన సభ్యుడు బోనెల విజయచంద్ర మాట్లాడుతూ.. ఉద్యాన పంటల మార్కెటింగ్‌పై దృష్టిసారించాలని కోరారు. తాగునీటి ద్వారా సంభవించే వ్యాధులను నివారించాలని అన్నారు. పాలకొండ ఎమ్మెల్యే జయకృష్ణ మాట్లాడుతూ.. పాలకొండ ఏరియా ఆసుపత్రిలో ఆపరేషన్ థియేటర్ లేదని, దానిపై దృష్టిసారించాలని కోరారు. కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి మాట్లాడుతూ.. అంబులెన్స్‌లు లేక గిరిజనులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. గుమ్మలక్ష్మీపురం సీహెచ్‌సీ, పీహెచ్‌సీల్లో మందులు లేవని, అంబులెన్స్ ఐదు సంవత్సరాలుగా మూలన పడిందని చెప్పారు. కలెక్టర్ నిశాంత్‌కుమార్ మాట్లాడుతూ పీహెచ్‌సీల్లో మలేరియా కేసులు పరీక్షించడానికి కిట్లు ఉంచాలని అన్నారు. నకిలీ విత్తనాలు, ఎరువుల విక్రయించే దుకాణాలపై విస్తృతంగా దాడులు చేస్తున్నట్లు జిల్లా వ్యవసాయాధికారి కె.రాబర్ట్‌పాల్ తెలిపారు. జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులు, కాలువలు మరమ్మతులకు ప్రతిపాదనలు సమర్పించినట్లు జలవనరులశాఖ పర్యవేక్షక ఇంజనీర్ రాజరాజేశ్వరి చెప్పారు. జిల్లాలో 320 కిలోమీటర్లు మేర సాగునీటి కాలువల్లో పూడికలు తొలగింపునకు ఇప్పటికే చర్యలు చేపట్టినట్లు డ్వామా పీడీ కె.రామచంద్రరావు పేర్కొన్నారు. జిల్లాలో 1.40 కోట్ల పనిదినాలు కల్పించడానికి లక్ష్యంగా పనిచేస్తున్నామని, తద్వారా రూ.218 కోట్లు మెటీరియల్ కాంపోనెంట్ రానుందని, రూ.350 కోట్లు వరకు వేతనాలు అందుతాయని వివరించారు. జిల్లా పంచాయతీ అధికారి ఎం.వి.ఆర్.కృష్ణాజీ మాట్లాడుతూ.. ఆర్‌సీపీఎల్‌డబ్ల్యూ కింద 25 పనులు చేపట్టామని, అందులో 9 పనులు పూర్తి అయ్యాయని తెలిపారు. ఈ సమావేశంలో జేసీ శోభిక, ఇన్‌చార్జి జిల్లా రెవెన్యూ అధికారి జి.కేశవ నాయుడు, ఎస్‌డీసీ ఆర్.వి.సూర్యనారాయణ, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి రాజ్‌కుమార్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి విజయపార్వతి, తదితరులు పాల్గొన్నారు.

గోతుల దారిలో వెళ్లేదెలా?

- అధ్వానంగా అంతర్రాష్ట్ర రహదారి
- వర్షం పడితే నరకమే


గోతుల్లో ప్రయాణిస్తున్న భారీ వాహనాలు

కొమరాడ: పార్వతీపురం నుంచి కూనేరు వరకు ఉన్న అంతర్ రాష్ట్ర రహదారి గోతులతో అధ్వానంగా మారింది. కొమరాడ, గుమడ, పార్వతీపురం డంపింగ్ యార్డు, గంగరేగువలస, చోళ్లపథం, రామభద్రపురం, కూనేరు, ఇందిరానగరం గ్రామాల సమీపంలో రహదారిపై పెద్ద పెద్ద గోతులు ఏర్పడ్డాయి. దీంతో పాదచారులు, వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ రహదారి గుండా ఒడిశా, చత్తీస్‌ఘడ్, జార్ఖండ్, మధ్యప్రదేశ్ రాష్ట్రాలకు నిత్యం వందలాది లారీలు రాకపోకలు సాగిస్తుంటాయి. అంతేకాకుండా స్థానికంగా ఉన్న ప్రజలు ద్విచక్ర వాహనాలు, ఆటోలతో పాటు పలు వాహనాలపై రాకపోకలు సాగిస్తుంటారు. వీరంతా ఈ గోతులు వద్దకు వచ్చేసరికి ఎక్కడ అదుపు తప్పి ప్రమాదాలకు గురవుతామోనని భయపడున్నారు. ముఖ్యంగా వర్షం పడితే నరకం చూస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రహదారిపై ఏర్పడిన గోతులను తక్షణమే పూడ్చాలని ప్రయాణికులు కోరుతున్నారు. ఈ విషయమై కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి మాట్లాడుతూ.. గోతులను వెంటనే పూడ్చేందుకు చర్యలు చేపడుతున్నామని, ఇప్పటికే రోడ్లు భవనాలశాఖ ఇంజనీరింగ్ అధికారులతో మాట్లాడినట్లు చెప్పారు.

ఒకటో తేదీనే పింఛన్ల పంపిణీ

- సచివాలయ సిబ్బందిని వినియోగించండి: కలెక్టర్

పార్వతీపురం, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రత పింఛన్లను జూలై ఒకటో తేదీనే పంపిణీ చేయాలని కలెక్టర్ నిశాంత్‌కుమార్ ఆదేశించారు. పింఛన్ల పంపిణీపై మండల పరిషత్ అభివృద్ధి అధికారులతో గురువారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. గ్రామ, వార్డు సచివాలయ సిబ్బందితో పింఛన్ల పంపిణీ జరగాలన్నారు. ప్రతి ఉద్యోగి 50 పింఛన్లు పంచేలా సర్దుబాటు చేయాలని ఆదేశించారు. ఇందుకు క్లస్టర్ విధానం అనుసరించాలన్నారు. ప్రతి క్లస్టర్‌కు సిబ్బందిని పక్కాగా మ్యాపింగ్ చేయాలన్నారు. ఈ విషయంలో ఎవరికీ మినహాయింపు ఇవ్వరాదని స్పష్టం చేశారు. ఏఎన్ఎంలు, పంచాయతీ కార్యదర్శులు, మహిళా పోలీసులు, తదితర సిబ్బందిని వినియోగించాలని ఆదేశించారు. డీఆర్‌డీ ప్రాజెక్టు డైరెక్టర్ వై.సత్యంనాయుడు మాట్లాడుతూ.. జిల్లాలో 1,44,518 మందికి రూ.96.70 కోట్లను పింఛన్లగా పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఇందులో వృద్ధాప్య పింఛన్లు 79,342, అభయ హస్తం 4,577, చేనేత 766, దివ్యాంగ 17,004, వితంతు 34,747, కల్లు గీత కార్మిక 193, ట్రాన్స్‌జెండర్ 129, మత్స్యకార 824, ఒంటరి మహిళ 2,362, సంప్రదాయ చర్మకార 1,873, డప్పు కళాకారులు 1,784, కళాకారులు 133, కిడ్నీ వ్యాధిగ్రస్తులు 119, వైద్య అవసరాలకు సంబంధించి పింఛన్లు 660, సైనిక సంక్షేమ పింఛన్లు నాలుగు ఉన్నాయని వివరించారు.


వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్



ఆపదలో ఉన్నారా?

- ఒక్క ఫోన్ చేయండి
- పోలీసులు చేరుకుని సాయం అందిస్తారు
- టోల్ ఫ్రీ నెంబర్లను ప్రవేశపెట్టిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు

(గరుగుబిల్లి)

సమాజంలో ప్రస్తుతం మహిళలు, చిన్నారులపై అకృత్యాలు పెరిగాయి. వారు ఒంటరిగా బయటకు వెళ్లాలంటేనే భయపడే పరిస్థితి ఏర్పడింది. వారు తిరిగి వచ్చే వరకూ కుటుంబ సభ్యుల్లో ఆందోళన నెలకొంటుంది. అయితే, విపత్కర పరిస్థితులు ఎదురైనప్పుడు భయపడకుండా ఒక్క ఫోన్ చేస్తే చాలు పోలీసులు చేరుకుని బాధితులకు సాయం చేస్తారు. దీనికోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వివిధ టోల్ ఫ్రీ నంబర్లను ప్రవేశపెట్టాయి. వాటిని వినియోగించుకోవాలని పలు ప్రసార మాధ్యమాల ద్వారా ప్రచారం చేస్తోన్నాయి. ఆపద సమయంలో ఈ నెంబర్లకు ఫోన్ చేయాలని కోరుతున్నాయి.

డయల్ 100

రాష్ట్రంలో ఎక్కడ నుంచైనా 100 నంబరుకు డయల్ చేస్తే ఆ కాల్ పోలీస్ కంట్రోల్ రూముకు చేరుతుంది. ఫోన్ కాల్ చేసిన వ్యక్తి ఎలాంటి విపత్కర పరిస్థితిలో ఉన్నారో చెబితే చాలు. జీపీఎస్ లొకేషన్ ఆధారంగా గరిష్ఠంగా పది నిమిషాల లోపు అక్కడికి పోలీసులు చేరుకుని కాపాడతారు. అవసరమైతే ఘటనా స్థలానికి చేరుకునేంతవరకూ పోలీసులు బాధితులతో ఫోన్‌లో మాట్లాడుతూ వారికి పలు సూచనలు, సలహాలు ఇస్తూ ధైర్యం చెబుతారు.

182

మహిళలు ఒంటరిగా రైల్లో ప్రయాణిస్తున్నప్పుడు ఎవరి నుంచైనా వేధింపులకు గురైనా, ఆపదలో చిక్కుకున్నా అలాంటి సందర్భాల్లో 182 నంబరుకు ఫోన్ చేయాలి. ఆ కాల్ రైల్వే డివిజన్ పరిధిలోని రక్షక దళం (ఆర్‌పీఎఫ్) కంట్రోల్ రూమ్‌కు చేరుతుంది. బాధితులు అందించిన వివరాల ఆధారంగా ఆ రైల్లో ఆర్‌పీఎఫ్ సిబ్బంది వెంటనే బోగీలోకి చేరుకుని సాయం అందిస్తారు.

112

కేంద్ర హోం శాఖ అందుబాటులోకి తీసుకువచ్చిన ఈ యాప్ మహిళలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. దేశంలో ఎక్కడి నుంచైనా, ఏ సమయంలోనైనా కాల్ చేయవచ్చు. బాధితులు ఏ రాష్ట్రం నుంచి ఫోన్ చేస్తే ఆ రాష్ట్రంలోని పోలీస్ కంట్రోల్ రూముకు ఫోన్ కాల్ వెళుతుంది. పోలీసులు చేరుకుని సాయం చేస్తారు.

- గూగుల్ ప్లే స్టోర్‌లో దీనిని డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ప్రొఫైల్‌లో పేరు, ఫోన్ నంబరు, పుట్టిన తేదీ, రాష్ట్రం, తదితర వివరాలను నమోదు చేసుకోవాలి.
- ఆపదలో ఉన్నప్పుడు ఆ సమాచారం పోలీసులతో పాటు కుటుంబ సభ్యులకు తెలిసేలా ముఖ్యమైన వారి ఫోన్ నంబర్లు అందులో సేవ్ చేసుకోవచ్చు.
- హోం స్క్రీన్‌పైకి వెళ్లిన వెంటనే పోలీస్ అని కనిపిస్తుంది. అత్యవసర మీటను నొక్కితే చాలు వారు ఆపదలో ఉన్నట్లు పోలీస్ కంట్రోల్ రూమ్‌కు సమాచారం అందుతుంది. బాధితులు ఉన్న లొకేషన్ వివరాలు కూడా చేరుతాయి. వెంటనే 112 నంబర్ నుంచి కాల్ వస్తుంది. సమీపంలోని పోలీసులు, గస్తీ వాహనాలు అప్రమత్తమై సాయం అందిస్తాయి.

9121211100

మహిళలపై జరుగుతున్న సైబర్ నేరాలపై ఫిర్యాదులు స్వీకరించేందుకు సైబర్ మిత్ర పేరిట ఈ నంబర్‌ను రాష్ట్ర పోలీసులు అందుబాటులోకి తీసుకువచ్చారు. అత్యవసర పరిస్థితుల్లో రక్షణకు దీనిని ఉపయోగించుకోవచ్చు. ఈ నంబర్‌కు వాట్సాప్ చేయడం, లొకేషన్ పంపించడం ద్వారా ఆపదలో ఉన్నామని పోలీసులకు తెలియజేయవచ్చు. పోలీసులు వెంటనే స్పందించి అవసరమైన సాయం అందిస్తా రు. ఈ నంబర్ 24 గంటలూ పనిచేస్తుంది.


నాగావళి నదిలో చేపలను వేటాడుతున్న నదీ తీర ప్రాంతవాసులు

నదిలోకి దిగి.. చేపలు పట్టి..

కొమరాడ, జూన్ 27: గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు నాగావళి నదికి ఎగువ ప్రాంతం నుంచి కొత్త నీరు వచ్చి చేరుతోంది. దీంతో తోటపల్లి భారీ సాగునీటి ప్రాజెక్టులో ఉన్న చేపలు నదిలోకి వచ్చి చేరుతున్నాయి. దీంతో చేపలు పట్టేందుకు నాగావళి తీర ప్రాంత గ్రామాలు దుగ్గి, కళ్లికోట, గుంప, దళాయిపేట, గుమడ, తొడుము, కొట్టు, కొమరాడ ప్రజలు తండోపతండాలుగా నదిలో దిగి చేపల వేటను చేస్తున్నారు. దీంతో నాగావళి తీరంలో ఈ సందడి నెలకొంది.

సెన్సెక్స్ 79,000 పైకి..
24,000 స్థాయికి నిఫ్టీ

- సరికొత్త ఉన్నత శిఖరాలకు సూచీలు
- నాలుగో రోజూ లాభాల బాటలో మార్కెట్
- రూ.438.41 లక్షల కోట్లకు మదుపరుల సంపద

ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్లో గురువారం రికార్డుల మోత మోగింది. వరుసగా నాలుగో రోజూ ర్యాలీ తీసిన ప్రామాణిక సూచీలు సరికొత్త ఉన్నత శిఖరాలను అధిరోహించాయి. సెన్సెక్స్ తొలిసారిగా 79,000 మైలురాయిని చేరగా.. నిఫ్టీ 24,000 మార్క్‌ను దాటింది. మార్కెట్ దిగ్గజం రిలయన్స్ ఇండస్ట్రీస్‌తో పాటు ఐటీ కంపెనీలైన టీసీఎస్, ఇన్ఫోసిస్ షేర్లలో కొనుగోళ్లు సూచీలను మరింత ముందుకు నడిపించాయి. సెన్సెక్స్ ఒక దశలో 721.78 పాయింట్లు ఎగబాకి 79,396.03 వద్ద సరికొత్త ఆల్‌టైం ఇంట్రాడే రికార్డును నమోదు చేసింది. ట్రేడింగ్ నిలిచేసరికి, సూచీ 568.93 పాయింట్ల లాభంతో 79,243.18 వద్ద స్థిరపడింది. సూచీకిది సరికొత్త జీవితకాల గరిష్ఠ ముగింపు కూడా. నిఫ్టీ సైతం ఒక దశలో 218.65 పాయింట్ల వృద్ధితో 24,087.45 వద్ద ఆల్‌టైం ఇంట్రాడే రికార్డును, చివర్లో 175.70 పాయింట్ల లాభంతో 24,044.50 వద్ద కొత్త జీవిత కాల గరిష్ఠ ముగింపును నమోదు చేసింది.

ఈ మంగళవారం 78,000 స్థాయికి చేరిన సెన్సెక్స్.. కేవలం రెండు ట్రేడింగ్ సెషన్లలోనే మరో 1,000 పాయింట్ల మేర పుంజుకుంది. గత నెల 24న తొలిసారిగా 23,000 మైలురాయిని తాకిన నిఫ్టీ, కేవలం 23 ట్రేడింగ్ సెషన్లలో మరో 1,000 పాయింట్లు వృద్ధిని కనబరిచింది. మార్కెట్ జైత్రయాత్రలో ఈక్విటీ ఇన్వెస్టర్ల సంపదగా పరిగణించే బీఎస్ఈ నమోదిత కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ సైతం సరికొత్త జీవిత కాల గరిష్ఠ స్థాయి రూ.438.41 లక్షల కోట్లకు (5.25 లక్షల కోట్ల డాలర్లు) చేరుకుంది. గడిచిన నాలుగు ట్రేడింగ్ సెషన్లలో సెన్సెక్స్ 2,033.28 పాయింట్లు (2.63 శాతం) పుంజుకోగా.. మార్కెట్ సంపద రూ.3.93 లక్షల కోట్లు పెరిగింది.

వచ్చే నెల 3 నుంచి ఎమ్‌క్యూర్ ఫార్మా ఐపీఓ

అంతర్జాతీయ ప్రైవేట్ ఈక్విటీ దిగ్గజం బెయిన్ క్యాపిటల్ పెట్టుబడులు కలిగిన ఎమ్‌క్యూర్ ఫార్మా తొలి పబ్లిక్ ఆఫరింగ్ (ఐపీఓ) వచ్చేనెల 3న ప్రారంభమై 5న ముగియనుంది. ఐపీఓలో భాగంగా కంపెనీ రూ.800 కోట్ల తాజా ఈక్విటీ జారీతో పాటు ప్రస్తుత ప్రమోటర్లు, వాటాదారులకు చెందిన 1.14 కోట్ల ఈక్విటీ షేర్లను ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) పద్ధతిన విక్రయించనుంది. వచ్చేనెల 10న కంపెనీ తన షేర్లను స్టాక్ ఎక్స్ఛేంజీల్లో నమోదు చేసే అవకాశం ఉంది.

జేపీ మోర్గాన్ బాండ్ ఇండెక్స్‌లోకి భారత ప్రభుత్వ సెక్యూరిటీలు

భారత ప్రభుత్వ బాండ్లు (జీ-సెక్) శుక్రవారం నుంచి జేపీ మోర్గాన్-ఎమర్జింగ్ మార్కెట్ బాండ్ ఇండెక్స్‌లో భాగం కానున్నాయి. వచ్చే 10 నెలల (2024 జూన్ 28 నుంచి 2025 మార్చి 31) కాలంలో ఈ సూచీలో చేరనున్నాయి. నెలకు ఒక శాతం చొప్పున పది నెలల్లో గరిష్ఠంగా సూచీలో 10 శాతం వెయిటేజీ వరకు భారత జీ-సెక్‌లను సూచీలో చేర్చనున్నారు. తద్వారా వచ్చే పది నెలల్లో మన ప్రభుత్వ బాండ్లలోకి కనీసం 2,000-2,500 కోట్ల డాలర్ల మేర విదేశీ పెట్టుబడులు రావచ్చని అంచనా. దాంతో మన జీ-సెక్‌ల రేట్లు తగ్గడంతో ప్రభుత్వానికి రుణ సమీకరణ వ్యయం కూడా తగ్గనుందని విశ్లేషకులు పేర్కొన్నారు.

ఇండియా సిమెంట్స్‌లో అల్ట్రాటెక్ పాగా

రూ.1,900 కోట్లతో 23% వాటా కొనుగోలు

న్యూఢిల్లీ: దేశీయ సిమెంట్ రంగంలో కన్సాలిడేషన్ కొనసాగుతోంది. తాజాగా ఆదిత్య బిర్లా గ్రూప్ కంపెనీ అల్ట్రాటెక్ సిమెంట్.. చెన్నై కేంద్రంగా ఉన్న ఇండియా సిమెంట్స్ ఈక్విటీలో 22.77 శాతం వాటా కొనుగోలు చేసింది. ఇందుకోసం రూ.1,889.27 కోట్లు చెల్లించింది. డీమార్ట్ ప్రమోటర్ రాధాకృష్ణ దమానీ, ఆయన కుటుంబ సభ్యుల నుంచి అల్ట్రాటెక్ 2 బ్లాక్ డీల్స్ ద్వారా ఈ వాటాలు కొనుగోలు చేసింది. ఇందుకోసం మొదటి బ్లాక్ డీల్‌లో ఒక్కో షేరుకు రూ.265 చొప్పున, రెండో బ్లాక్ డీల్‌లో ఒక్కో షేరుకు రూ.285 చొప్పున చెల్లించింది.

ముందు చూపుతోనే: ఇది కేవలం పెట్టుబడి లాభాల కోసం జరిపిన కొనుగోలు అని అల్ట్రాటెక్ చెబుతోంది. అయితే ఇప్పటికే నష్టాల్లో ఉన్న ఇండియా సిమెంట్స్‌ని ఎలాగైనా కైవసం చేసుకునే వ్యూహంతోనే అల్ట్రాటెక్.. ఇండియా సిమెంట్స్ ఈక్విటీలో 23 శాతం వాటా కొనుగోలు చేసిందని భావిస్తున్నారు. గతంలో బీవీ రాజు నిర్వహణలోని రాశి సిమెంట్, విష్ణు సిమెంట్ టేకోవర్ కోసం గతంలో ఇండియా సిమెంట్స్ కూడా ఇదే వ్యూహాన్ని అనుసరించింది. ముందు పెట్టుబడి లాభాల కోసమే అంటూ, ఈ రెండు కంపెనీల ఈక్విటీలో కొంత వాటా కొనుగోలు చేసింది. తర్వాత బీవీ రాజు బంధువుల నుంచి మరింత వాటా కొనుగోలు చేసి ఈ రెండు సంస్థలను కైవసం చేసుకుంది. ఇండియా సిమెంట్ ఈక్విటీలో ఇప్పటికీ ప్రధాన ప్రమోటర్ ఎన్ శ్రీనివాసన్‌కు, ఆయన నిర్వహణలోని ఇన్వెస్ట్‌మెంట్ కంపెనీలకు 28 శాతం వాటా ఉంది. మిగతా 49 శాతం వాటా రిటైల్ మదుపరులు, సంస్థాగత మదుపరుల చేతుల్లో ఉంది.

జియో సేవలు మరింత ప్రియం

27% వరకు టారిఫ్‌ల పెంపు

జూలై 3 నుంచి అమల్లోకి
స్పెక్ట్రమ్ వేలం ముగిసిన మరునాడే వడ్డింపు
జియో బాటలో మిగతా టెల్కోలు!



న్యూఢిల్లీ: టెలికాం రంగంలో టారిఫ్‌ల పెంపు మళ్లీ ప్రారంభమైంది. ముకేశ్ అంబానీ సారథ్యంలోని రిలయన్స్ జియో ఇందుకు నాంది పలికింది. తన ప్లాన్స్‌లోని అన్ని మొబైల్ టారిఫ్స్‌ను 12 నుంచి 27 శాతం వరకు పెంచుతున్నట్టు ప్రకటించింది. ఈ పెంపు జూలై 3వ తేదీ నుంచి అమల్లోకి వస్తుంది. రెండున్నర సంవత్సరాల తర్వాత జియో తన మొబైల్ టారిఫ్స్‌ను పెంచడం ఇదే మొదటిసారి. '5జీ, ఏఐ టెక్నాలజీల్లో పెట్టుబడుల ద్వారా స్థిరమైన అభివృద్ధి కోసం టారిఫ్‌లు పెంచుతున్నాం' అని రిలయన్స్ జియో ఇన్ఫోకామ్ చైర్మన్ ఆకాశ్ అంబానీ ఒక ప్రకటనలో తెలిపారు. అంతేకాకుండా అన్‌లిమిటెడ్ ఉచిత 5జీ సర్వీసులను కొన్ని ప్లాన్స్‌లోని కస్టమర్లకే కంపెనీ పరిమితం చేసింది. స్పెక్ట్రమ్ వేలం ముగిసిన మరుసటి రోజే రిలయన్స్ జియో టారిఫ్‌లు పెంచడం విశేషం. దీంతో మిగతా టెలికాం కంపెనీలు త్వరలోనే రిలయన్స్ జియోను అనుసరించే అవకాశం ఉందని భావిస్తున్నారు.

పెంపు ఇలా: ప్రస్తుతం రూ.15గా ఉన్న ఒక జీబీ డేటా యాడ్ ఆన్ ప్యాక్ ధరను రూ.19కు (27 శాతం) పెంచింది. 75 జీబీ పోస్ట్ పెయిడ్ డేటా ప్లాన్ టారిఫ్‌ను రూ.399 నుంచి రూ.449కి పెంచేసింది. ఇక అత్యంత ప్రజాదరణ పొందిన 84 రోజులు చెల్లుబాటయ్యే రూ.666 అన్‌లిమిటెడ్ ప్లాన్ టారిఫ్‌ను రూ.799కి (20 శాతం) పెంచేసింది. ఏడాది పాటు చెల్లుబాటయ్యే వార్షిక పథకాల టారిఫ్‌లనూ రూ.1,559 నుంచి రూ.1,899కి, రూ.2,999 నుంచి రూ.3,599కి పెంచింది. రోజుకి 2 జీబీ లేదా అంతకంటే ఎక్కువ జీబీ ప్లాన్స్‌లో ఉన్న ఖాతాదారులకు అపరిమిత 5జీ డేటా లభిస్తుందని తెలిపింది.

ఉచితంగా రెండు యాప్స్

టారిఫ్‌ల పెంపుతో పాటు తన ఖాతాదారుల కోసం రిలయన్స్ జియో రెండు ప్రత్యేక యాప్స్‌ని అందుబాటులోకి తెచ్చింది. జియో సేఫ్, జియో ట్రాన్స్‌లేట్ అనే ఈ రెండు యాప్స్ ఏడాది పాటు జియో ప్రస్తుత ఖాతాదారులకు ఉచితంగా అందుబాటులో ఉంటాయి. ఇందులో జియో సేఫ్ యాప్ ద్వారా సురక్షితంగా కాల్స్, మెసేజ్‌లు, ఫైల్స్ ట్రాన్స్‌ఫర్‌తో సహా అనేక పనులు చేయవచ్చని తెలిపింది. ఇక కృత్రిమ మేధ (ఏఐ) ఆధారిత జియో ట్రాన్స్‌లేటర్‌యాప్ ద్వారా వాయిస్ కాల్స్, వాయిస్ మెసేజ్‌లు, టెక్స్ట్, ఇమేజ్‌లను వివిధ భాషల్లోకి తర్జుమా చేయవచ్చు. కొత్తగా చేరే ఖాతాదారులు మాత్రం ఈ యాప్స్‌కి నెలకు రూ.99 నుంచి రూ.199 వరకు చెల్లించాలి.

2024-25లో ఫార్మా ఎగుమతుల్లో 10% వృద్ధి

రూ.2.6 లక్షల కోట్లుగా నమోదయ్యే చాన్స్

ఫార్మెక్సిల్ డైరెక్టర్ జనరల్ ఉదయ్ భాస్కర్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25)లో భారత్ నుంచి 3,100 కోట్ల డాలర్ల (దాదాపు రూ.2.6 లక్షల కోట్లు) ఫార్మా ఉత్పత్తులు ఎగుమతి కావచ్చని ఫార్మాస్యూటికల్ ఎక్స్‌పోర్ట్స్ ప్రమోషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (ఫార్మెక్సిల్) అంచనా వేస్తోంది. గత ఆర్థిక సంవత్సరం (2023-24)లో ఫార్మా ఎగుమతులు 2,785 కోట్ల డాలర్లు (రూ.2.32 కోట్లు)గా ఉన్నాయని, 2024-25లో ఇవి 10-12 శాతం వరకు వృద్ధిని నమోదు చేసే అవకాశం ఉందని భావిస్తున్నట్లు ఫార్మెక్సిల్ డైరెక్టర్ జనరల్ ఉదయ్ భాస్కర్ వెల్లడించారు. గురువారం నాడిక్కడ ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్-మే నెలల కాలంలో ఫార్మా ఎగుమతులు 8.85 శాతం వృద్ధితో 435 కోట్ల డాలర్ల నుంచి 473 కోట్లకు పెరిగాయని తెలిపారు. ఎగుమతులపరంగా కొన్ని సవాళ్లు ఎదుర్కొంటున్నప్పటికీ నిర్దేశిత ఎగుమతుల లక్ష్యాలను చేరుకుంటామని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.

ఆఫ్ పేటెంట్ ఔషధాలతో అపార అవకాశాలు: 2023 నుంచి 2029 వరకు అంతర్జాతీయంగా 15 బ్లాక్‌బస్టర్ ఔషధాల పేటెంట్ గడువు తీరిపోనుందని, ఈ ఔషధాలతో భారత ఫార్మా పరిశ్రమ అపారమైన అవకాశాలు దక్కించుకునే వీలుందని ఉదయ్ భాస్కర్ తెలిపారు. ఈ ఆఫ్-పేటెంటెడ్ ఔషధాల విలువ దాదాపు 11,200 కోట్ల డాలర్లుగా ఉందని, ఇందులో భారత కంపెనీలు 1,000 కోట్ల డాలర్ల వరకు అవకాశాలను అందుకునే అవకాశం ఉందన్నారు. కాగా ప్రస్తుతం దేశీయ ఫార్మా కంపెనీలు.. అంతర్జాతీయ రెగ్యులేటరీ సంస్థల నుంచి కొన్ని సవాళ్లు ఎదుర్కొంటున్నాయని, చాలా వరకు ఇవి నాణ్యతకు సంబంధించినవిగా ఉంటున్నాయని వివరించారు. అయితే ఈ సమస్యను అధిగమించేందుకు ఫార్మెక్సిల్ ప్రత్యేకంగా చర్యలు తీసుకుంటోందని తెలిపారు.

నట్టేట ముంచే పెట్టుబడి సలహాదారులకు చెక్!

- సెబీ నియంత్రణలోకి ఫైనాన్షియల్ ఇన్‌ఫ్లుయెన్సర్స్
- అన్ రిజిస్టర్డ్ ఫిన్‌ఫ్లుయెన్సర్లకు కొత్త నియమావళి
- డెరివేటివ్స్‌లో స్టాక్స్ ఎంట్రీకి కఠిన నిబంధనలు
- సెబీ బోర్డులో పలు కీలక నిర్ణయాలు



ముంబై: డిజిటల్ మాధ్యమాల ద్వారా ఆర్థిక పెట్టుబడులపై సలహాలిచ్చే ఫైనాన్షియల్ ఇన్‌ఫ్లుయెన్సర్ల (ఫిన్‌ఫ్లుయెన్సర్స్)ను నియంత్రించాలని క్యాపిటల్ మార్కెట్ నియంత్రణ మండలి సెబీ నిర్ణయించింది. అన్‌రిజిస్టర్డ్ ఫిన్‌ఫ్లుయెన్సర్స్ కోసం నియమావళిని విడుదల చేసింది. అన్ రిజిస్టర్డ్ ఫిన్‌ఫ్లుయెన్సర్స్‌తో సెబీ నమోదిత కంపెనీలు, వారి ఏజెంట్లు ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా భాగస్వాములు కాకుండా నిషేధం విధించింది. గురువారం సమావేశమైన సెబీ బోర్డు ఈ ప్రతిపాదనను ఆమోదించింది. పక్షపాతంతో, పక్కదోవ పట్టించే సలహాలిచ్చే ఫిన్‌ఫ్లుయెన్సర్స్‌తో ముప్పు పొంచి ఉన్న నేపథ్యంలో నియంత్రణ మండలి తాజా చర్యలు చేపట్టింది. ఎందుకంటే, పెట్టుబడులు, మదుపు కోసం ఫిన్‌ఫ్లుయెన్సర్ల సలహాలపై ఆధారపడే చిన్న మదుపరుల సంఖ్య గడిచిన కొన్నేళ్లలో భారీగా పెరిగింది. సెబీ కొత్త నియమావళి ఫిన్‌ఫ్లుయెన్సర్లను వారిచ్చే సలహాలకు బాధ్యులుగా, జవాబుదారీగా చేయనుంది. అంతేకాదు, సెబీ రిజిస్టర్డ్ ఇన్వెస్ట్‌మెంట్ అడ్వైజర్లు (ఐఏ), రీసెర్చ్ అనలిస్టులు (ఆర్ఏ) తమ క్లయింట్ల నుంచి రుసుము వసూలు చేసేందుకు క్లోజ్డ్ ఎకోసిస్టమ్‌ను ఏర్పాటు చేయాలని కూడా నియంత్రణ మండలి నిర్ణయించింది.

అప్పు చేసి ఎఫ్ అండ్ ఓ ట్రేడింగ్: బుచ్

ఏదైనా కంపెనీ షేరును డెరివేటివ్ ట్రేడింగ్‌లో చేర్చడం లేదా వైదొలగడానికి సంబంధించిన అర్హత నిబంధనలను సెబీ కఠినతరం చేసింది. నిత్యం తక్కువ టర్నోవర్ కలిగిన స్టాక్స్‌ను ఫ్యూచర్ అండ్ ఆప్షన్స్ (ఎఫ్ అండ్ ఓ) విభాగం నుంచి ఏరివేసేందుకు ఇది దోహదపడనుంది. అంతేకాదు, ఎఫ్ అండ్ ఓ విభాగ ట్రేడింగ్‌పై సమీక్ష జరిపేందుకు సెబీ 15 మంది సభ్యులతో కూడిన నిపుణుల బృందాన్ని ఏర్పాటు చేసింది. ఈ కమిటీ మూడు కోణాల్లో (మార్కెట్ అభివృద్ధి, ఇన్వెస్టర్ల సొమ్ముకు రక్షణ, పొంచి ఉన్న ముప్పులు) ఎఫ్ అండ్ ఓ మార్కెట్‌ను సమీక్షించనుందని బోర్డు భేటీ అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సెబీ చీఫ్ మాధవి పురి బుచ్ తెలిపారు. ఎఫ్ అండ్ ఓ ట్రేడింగ్‌లో రిటైల్ ఇన్వెస్టర్ల పాత్ర పెరగడం ఆర్థిక వ్యవస్థపై ప్రతికూల ప్రభావం చూపవచ్చన్నారు. చిన్న ఇన్వెస్టర్లు అప్పు చేసి మరీ ఎఫ్ అండ్ ఓలో ట్రేడింగ్ నెరుపుతున్నారని, కుటుంబ పొదుపు సొమ్మునూ కరిగించేస్తున్నారని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. ఇది ఏమాత్రం మంచిది కాదన్నారు.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	71,730 ▼	65,750 ▼	94,500 ▼
ముంబై	71,391 ▲	65,394 ▲	87,043 ▲

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు) 28వ తేదీ

హైదరాబాద్	515	విజయవాడ	520
వరంగల్	517	గోదావరి	515
చిత్తూరు	573	విశాఖపట్నం	525
		దజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ.		వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్	
హైదరాబాద్	110	విజయవాడ	123
వరంగల్	110	గుంటూరు	123
కరీంనగర్	110	ఒంగోలు	123
మహబూబ్‌నగర్	110	చిత్తూరు	130
కర్నూలు	110	నెల్లూరు	130
విశాఖపట్నం	129	అనంతపురం	123
గోదావరి	123		

నవ్య | చిత్రజ్యోతి

పది రోజుల వర్కే బ్యాలెన్స్



ఒక సినిమా తర్వాతే మరో సినిమా చేయడం తమిళ దర్శకుడు శంకర్‌కు అలవాటు. అయితే అనుకోని పరిస్థితుల వల్ల ఆయన ఒకేసారి రెండు సినిమాలు.. 'భారతీయుడు 2', 'గేమ్‌ఛేంజర్' చేయాల్సి వస్తోంది. విశిష్ట నటుడు కమల్‌హాసన్ నటిస్తున్న 'భారతీయుడు 2' చిత్రం వచ్చే నెలలో విడుదలవుతుండడంతో కాస్త ఊపిరి తీసుకున్న శంకర్ ఒకపక్క 'భారతీయుడు 2' ప్రమోషన్స్‌లో పాల్గొంటూనే రామ్‌చరణ్ నటిస్తున్న 'గేమ్‌ఛేంజర్' మీద కూడా దృష్టి పెట్టారు. ఈ సినిమా గురించి అప్‌డేట్ వచ్చి చాలా కాలం అవుతోంది. 'భారతీయుడు 2' ప్రమోషన్స్‌లో భాగంగా దర్శకుడు ఇచ్చిన ఇంటర్వ్యూలో 'గేమ్‌ఛేంజర్' గురించి అప్‌డేట్ ఇచ్చారు. 'సినిమా షూటింగ్ దాదాపుగా పూర్తయింది. ఇంకో పది రోజుల వర్క్ మాత్రమే మిగిలి ఉంది. 'భారతీయుడు 2' విడుదల కాగానే ఆ వర్క్ మొదలుపెడతాను. ఆ తర్వాత ఫైనల్ ఫుటేజ్ చూసి పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ ప్రారంభిస్తా. అవన్నీ పూర్తయ్యాక విడుదల ఎప్పుడనేది నిర్ణయిస్తా. సాధ్యమైనంత వరకూ తొందరగానే 'గేమ్‌ఛేంజర్' రిలీజ్ చేయడానికి ప్రయత్నిస్తా' అని శంకర్ వెల్లడించారు. పొలిటికల్, యాక్షన్ నేపథ్యంలో సాగే ఓ పవర్‌ఫుల్ కథాంశంతో రూపుదిద్దుకుంటున్న 'గేమ్‌ఛేంజర్' లో కియారా అద్వానీ కథానాయిక. శ్రీకాంత్, అంజలి, సునీల్, ఎస్.జె.సూర్య, సముద్రఖని, నవీన్‌చంద్ర, అజయ్ ఘోష్ తదితరులు చిత్రంలో కీలక పాత్రలు పోషిస్తున్నారు.

సంక్రాంతి బరిలో అజిత్ చిత్రం



తమిళ అగ్రకథానాయకుడు అజిత్ నటిస్తున్న తాజా చిత్రం 'గుడ్ బ్యాడ్ అగ్లీ'. తెలుగు, తమిళ భాషల్లో పూర్తి వినోదభరితంగా రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రానికి అదిక్ రవిచంద్రన్ దర్శకుడు. మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్న ఈ చిత్రం సెకండ్ లుక్ పోస్టర్‌ను గురువారం విడుదల చేశారు. అజిత్ బ్లాక్ షేడ్స్ ధరించి , ఖైదీ డ్రస్‌లో కనిపించారు, ఆయన చేతి మీద ఉన్న టాటూ, బ్యాక్ గ్రౌండ్‌లో మ్యాసివ్ గన్ ఫైరింగ్ స్టన్నింగ్‌గా ఉన్నాయి. ఈ పోస్టర్‌లోనే వచ్చే ఏడాది సంక్రాంతికి విడుదల చేస్తున్నట్లు నిర్మాతలు వెల్లడించారు. దీంతో సంక్రాంతి బరిలో మరో చిత్రం చేరనట్లయింది. భారీ బడ్జెట్‌తో రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రానికి సంగీతం: దేవిశ్రీప్రసాద్, ఫొటోగ్రఫీ: అభినందన్ రామానుజం, ఎడిటింగ్: విజయ్ వేలుకుట్టి. చీఫ్ ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: దినేశ్ నరసింహన్, నిర్మాతలు: నవీన్ యర్నేని, రవిశంకర్.

ఇక్కడే నా జీవితం మొదలైంది

రష్మిక భావోద్వేగం



ఒక పక్క అల్లు అర్జున్, ఇంకో పక్క ధనుష్, ఆ పక్క సల్మాన్‌ఖాన్. ఇవీ కాకుండా జూనియర్ ఎన్టీఆర్, దర్శకుడు ప్రశాంత్ నీల్ చిత్రంలోనూ, ప్రభాస్ 'స్పిరిట్' సినిమాలోనూ ఆమె హీరోయిన్ అంటున్నారు. అలాగే 'గర్ల్‌ఫ్రెండ్' పేరుతో చేస్తున్న లేడీ ఓరియంటెట్ సినిమా ఉండనే ఉంది. ఇలా వరుసగా క్రేజీ ప్రాజెక్టులతో రష్మిక హవా మామూలుగా లేదు. ఇంత బిజీగా ఉన్న ఆమె తీరిక చేసుకుని చిన్ననాటి స్నేహితురాలు వివాహానికి తను పుట్టి పెరిగిన ఊరు 'కొడగు' వెళ్లింది. కర్నాటక రాష్ట్రంలోని ఆ ప్రాంతానికి వెళ్లగానే బాల్య స్మృతులు ఒక్కసారిగా చుట్టుముట్టడంతో భావోద్వేగానికి లోనయ్యారు. 'కొడగు.. నా హృదయం, నా చరిత్ర. జీవితం ఇక్కడే మొదలైంది' అంటూ ఈ సందర్భంగా దిగిన ఫొటోలు సోషల్ మీడియాలో షేర్ చేసింది. చిన్ననాటి స్నేహితురాళ్లను కలుసుకొని ఆ నాటి ముచ్చట్లను గుర్తు చేసుకుని మురిసిపోయింది.


రిలీజ్ డేట్ వచ్చేసింది



తమిళ హీరో సూర్య పోరాట యోధుడిగా నటిస్తున్న పాన్ ఇండియా చిత్రం 'కంగువ'. అభిమానులంతా ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న ఈ సినిమా రిలీజ్ డేట్‌ను గురువారం మేకర్స్ ప్రకటించారు. దసరా కానుకగా అక్టోబర్ 10న చిత్రం దాదాపు పది భాషల్లో త్రీడీలో, 2డీలో విడుదలవుతోంది. ఈ భారీ పీరియాడికల్ యాక్షన్ ఫిల్మ్‌కు 'వేదాలమ్', 'వీరుడొక్కడే', 'వివేకం' వంటి చిత్రాలు తీసిన శివ దర్శకత్వం వహిస్తున్నారు. దిశాపటాని, యోగిబాబు, బాబీడియోల్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు.

చిత్ర పరిశ్రమకు మంచి రోజులు

- ఎన్వీ ప్రసాద్



గడ్డుపరిస్థితుల్లో ఉన్న చిత్రపరిశ్రమకు మంచి రోజులు వచ్చాయని ప్రముఖ నిర్మాత, ఫిల్మ్ ఛాంబర్ మాజీ అధ్యక్షుడు ఎన్వీ ప్రసాద్ అన్నారు. గురువారం తిరుపతిలో ఆయన మీడియాతో మాట్లాడారు. తెలుగు చిత్ర పరిశ్రమ ప్రపంచంలోనే ఉన్నతస్థితికి చేరిందన్నారు. గతంలో రాజకీయ హింసలకు గురై దినదినగండంగా ఉండేదని గుర్తుచేశారు. ఇటీవల డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, సినిమాటోగ్రఫీ మంత్రి దుర్గేష్‌లతో చర్చలు సానుకూలంగా జరిగాయన్నారు. 'కల్కి' సినిమా సంచలన విజయం సాధించడం శుభపరిణామమన్నారు. కూటమి విజయంవలే సినీ పరిశ్రమ కూడా 'కల్కి'తో మంచి విజయాన్ని అందుకుందన్నారు. రెండు రాష్ట్ర ప్రభుత్వాల ముఖ్యమంత్రులు, డిప్యూటీ సీఎంలను కలిసి సినీ పరిశ్రమకు ఒకేరకమైన విధివిధానాలు ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరనున్నట్టు చెప్పారు. ఏపీలో కూడా సినీ పరిశ్రమ వికసిస్తుందన్నారు. ప్రపంచ సాంకేతిక పరిజ్ఞానాన్ని తెలుగు పరిశ్రమ అందిపుచ్చుకుందని, రాష్ట్రంలో కూడా తెలుగు సినిమాల షూటింగులు విరివిగా జరుపుకోనున్నాయన్నారు. ఇక్కడ స్టూడియోలు లేకపోయినా పెరిగిన సాంకేతిక పరిజ్ఞానంతో తాత్కాలిక సెట్లు వేసుకుని షూటింగులు చేసుకోవచ్చని ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు.

- తిరుపతి (ఆంధ్రజ్యోతి)

'కల్కి' టీమ్‌కు థ్యాంక్స్



దర్శకుడిగా ఎన్నో సంచలన చిత్రాలను తెరకెక్కించి ఎంతో మంది నూతన దర్శకులకి ఆదర్శప్రాయుడిగా నిలిచిన రామ్‌గోపాల్‌వర్మ.. 'కల్కి 2898 ఏ.డీ' సినిమాతో కొత్త అవతారం ఎత్తారు. గురువారం విడుదలై సూపర్ హిట్ టాక్ సొంతం చేసుకున్న ఈ చిత్రంలో ఓ అతిథి పాత్రలో మెరిశారు. ఇన్నేళ్ల సినీరంగంలో ఉన్న ఆయన.. ఓ సినిమాలో నటించడం మాత్రం ఇదే ప్రథమం. ఇందులో ఆయన పాత్ర చిన్నదైనా ఎంతో వినోదాత్మకంగా ఉందని సినిమా చూసిన వారంతా అనడం విశేషం. ఈ సందర్భంగా చిత్రబృందానికి, డైరెక్టర్‌కి థ్యాంక్స్ చెప్పి.. ఇందులో నటించిన వారందరినీ ప్రశంసించారు. ప్రభాస్ నటించిన ఈ పాన్ ఇండియా ప్రాజెక్ట్‌కు నాగ్‌అశ్విన్ దర్శకత్వం వహించారు. వైజయంతీ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై అశ్వనీ దత్ నిర్మించిన ఈ చిత్ర కథ మహా భారతంతో మొదలై క్రీస్తు శకం 2898లో పూర్తయ్యేలా, మొత్తం ఆరు వేల ఏళ్ల సంవత్సరాల వ్యవధిలో జరిగేలా తెరకెక్కింది. అమితాబ్ బచ్చన్, కమల్ హాసన్,దుల్కర్ సల్మాన్, విజయ్‌దేవరకొండ, రాజేంద్రప్రసాద్, బ్రహ్మానందం, పశుపతి, స్వాస్థ చటర్జీ, దీపికా పదుకొనే, దిశా పటానీ, మాళవిక నాయర్, శోభన, అన్నా బెన్ కీలక పాత్రలు పోషించారు.

'చిత్రజ్యోతి'లో మరిన్ని ఆసక్తికర కథనాల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/cx6B3gN లో చదవండి.

చినుకుపడితే వణుకు

- రోడ్లపైకి మురుగు, వర్షం నీరు
- చెరువులు తలపిస్తున్న వీధులు
- శాశ్వత పరిష్కారానికి నోచుకోని వైనం
- ఇదీ విజయనగరంలో పరిస్థితి


కంటోన్మెంట్ రైల్వే బ్రిడ్జి వద్ద నిలిచిన వర్షపు నీరు

విజయనగరం (ఆంధ్రజ్యోతి): విజయనగరంలో చినుకుపడితే ప్రజలకు వణుకు పుడుతోంది. వైసీపీ హయాంలో కాలువలు అభివృద్ధికి చేయకపోవడంతో చిన్న పాటి వర్షానికే రోడ్లపైకి నీరుచేరుతోంది. వీధులు చెరువులను తలపిస్తున్నాయి. దశాబ్దాలుగా ఉన్న సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించడంలో వైసీపీ పాలకులు విఫలమయ్యారని నగరవాసులు ఆరోపిస్తున్నారు.

ఇదీ పరిస్థితి..

విజయనగరంలో ఐదేళ్లుగా కాలువలు, రోడ్లు అభివృద్ధికి నోచుకోలేదు. ఎన్నికల ముందు వైసీపీ ప్రజాప్రతినిధులు అభివృద్ధి పేరుతో హడావుడి చేసి చేతులు దులుపుకొన్నారని, సుందరీకరణ పేరిట నగర పాలక సంస్థలోని ఖజానాను ఖాళీచేసేశారన్న విమర్శలొస్తున్నాయి. పెద్దచెరువు వద్ద పచ్చగడ్డి మొలిపించి ఇదే నగరాభివృద్ధి అని ప్రచారం చేశారు.కానీ ఏళ్లతరబడి విజయనగరంలో ఎదుర్కొంటున్న మురుగు, వర్షం నీటి సమస్యపై దృష్టిసారించలేదని విమర్శలొస్తున్నాయి. చిన్నపాటి వర్షం కురిస్తే నగరంలో ప్రధాన జంక్షన్లు జలమయవుతున్నాయి. దీంతో ఫుట్‌పాత్, తోపుడు బండ్లపై వ్యాపారాలు చేసుకునే చిరువ్యాపారులు చినుకుపడితే వణికిపోతున్నారు. వర్షం కురిస్తే వ్యాపారాలు నిలిచిపోయి ఆర్థికంగా నష్టపోతున్నామని వారంతా వాపోతున్నారు. మునిసిపల్ మార్కెట్, సిటీబస్‌స్టాండ్ మార్కెట్, పీడబ్ల్యూ మార్కెట్ తదితర వ్యాపారాలు నిర్వహించే ప్రాంతాల్లో మొకాళ్లలోతు, పాతమునిసిపల్ కార్యాలయం మార్కెట్ వద్ద నడుంలోతు వరకు నీరుచేరుతోంది. దీంతో నీటిలో ఫుట్‌పాత్ వ్యాపారులు సరుకులు మునిగిపోయి తరచూ పాడవుతున్న విషయం విదితమే. విజయనగరంలోని నాగవంశపు వీధి, అరకాల వారి వీధి, బుచ్చెన్న కోనేరు, దాసన్నపేట, ఆర్టీసీ కాంప్లెక్స్ రైల్వేస్టేషన్ రోడ్డు, గాజులరేగ తదితర లోతట్టు ప్రాంతాలు వర్షం కురిస్తే జలదిగ్బంధంలో చిక్కుకుంటున్నాయి. కాలువల్లో వ్యర్థాలు, మురుగు రోడ్లపైకి చేరుతుండడంతో పాదచారులు, వాహన చోదకులకు అగచాట్లు తప్పడంలేదు.


మార్కెట్‌లో నిలిచిపోయిన మురుగు నీరు

పాము కాటుతో మహిళ మృతి


లక్ష్మి (ఫైల్)

గుర్ల: మండలలోని గుజ్జింగివలస గ్రామానికి చెందిన అట్టాడ లక్ష్మి(65) పాముకాటుతో మృతిచెందింది. గ్రామంలో కిరాణాషాపు నడుపుకుంటూ జీవనం సాగిస్తున్న లక్ష్మి.. ఎప్పటిలాగే గురువారం ఉదయం షాపు తీసింది. షాపులో అప్పటికే పాము ఉండడాన్ని ఆమె చూసుకోలేదు. తీరా ఏదో వస్తువు అనుకుని పట్టుకోబోయేసరికి ఆ పాము ఒక్కసారిగా కాటువేసింది. దీంతో అదిరిపోయి కేకలు వేసింది. వెంటనే స్థానికులు చేరుకుని ఆమెను విజయనగరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతిచెందింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో దున్నపోతు..

భామిని: స్థానిక ఏకలవ్య పాఠశాల భవన నిర్మాణానికి సంబంధించిన విద్యుత్ వైర్లు తగిలి గురువారం ఓ దున్నపోతు మృతిచెందింది. సుమారు రూ.40 విలువైన పశువు మృతి చెందిందని భామిని గ్రామానికి చెందిన బాధితుడు గౌడు శుభాకర్ లబోదిబో మంటున్నాడు. తాత్కాలిక సర్వీస్ వైరు సుమారు 500 మీటర్లు వేయడంతో అటువైపు వెళ్లిన వారు విమర్శిస్తున్నారు. నాసిరకం కర్రల ఆధారంగా తక్కువ ఎత్తులో విద్యుత్ సరఫరా ఉందని వాపోతున్నారు. దీనిపై ట్రాన్స్‌కో ఏఈ వద్ద ప్రస్తావించగా భవన నిర్మాణ పనులకు తాత్కాలిక సరఫరా ఇచ్చామని, గతంలోనే కాంట్రాక్టర్‌కు పొడవైన కర్ర, ఎత్తులో విద్యుత్ సరఫరా చేయాలని పలుమార్లు చెప్పినా వారు పట్టించుకోలేదని చెప్పారు.

అధిక ధరలకు ఎరువులు అమ్మితే చర్యలు

- కొత్తవలస వ్యవసాయశాఖ సబ్ డివిజన్ అధికారి విజయ


విత్తనాల స్టాకును పరిశీలిస్తున్న వ్యవసాయశాఖ ఏడీ విజయ

లక్కవరపుకోట: రైతులకు కావాల్సిన ఎరువులు, విత్తనాలు అధిక ధరలకు అమ్మితే కఠిన చర్యలు తప్పవని కొత్తవలస వ్యవసాయశాఖ సబ్ డివిజన్ అధికారి ఎల్. విజయ తెలిపారు. గురువారం ఎల్.కోట, సీతారాంపురం విత్తన డిపోను ఆమె ఏవో స్వాతితో కలిసి తనిఖీచేశారు. ఈ సందర్భంగా పలువురు రైతులను ధరల గురించి అడిగి తెలుసుకున్నారు. సబ్‌డివిజన్ పరిధిలోని ఐదు మండలాల షాపులను తనిఖీచేసి రిపోర్టు తయారు చేసినట్లు చెప్పారు. రైతులకు విత్తనాలు, ఎరువులు ఎక్కడా కొరత రాకూడదని తెలిపారు. విత్తనాల సమాచారాన్ని ఎప్పటికప్పుడు తెలియజేయాలని కోరారు.

కలుపు యాజమాన్యంపై దృష్టి సారించాలి

బాడంగి: వరి నేరుగా ఎద పద్ధతిలో సాగుచేసేవారు కలుపు యాజమాన్యంపై దృష్టిసారించాలని ఏవో కె.శిరీష తెలిపారు. మండలంలోని రేజేరు రైతుభరోసా కేంద్రంలోరైతులకు వరి సాగుపై మెళకువలను వివరించారు. కార్యక్రమంలో సాయికుమార్, గ్రామ రైతులు పాల్గొన్నారు.

విత్తనాలు పంపిణీ చేయాలి

జామి: మండలంలోని అగ్రహారం పరిధిలో భూములకు పట్టాదారు పాసు పుస్తకాలతో పనిలేకుండా రాయితీపై వరివిత్తనాలు పంపిణీచేయాలని జడ్పీటీసీ మాజీ సభ్యుడు బండారు పెదబాబు కోరారు. ఈమేరకు గురువారం ఏవో కిరణ్‌కు వినతిపత్రం అందించారు.

వ్యాధులపై అవగాహన కల్పించండి

- జిల్లా వైద్యఆరోగ్యశాఖాధికారి భాస్కరరావు


దబ్బగుంటలో మాలేరియ వ్యతిరేక మాసోత్సవాలు నిర్వహిస్తున్న సిబ్బంది

శృంగవరపుకోట రూరల్:వర్షాకాలంలో వ్యాధులపై ప్రజలకు వైద్యులు, సిబ్బంది అవగాహన కల్పించాలని జిల్లా వైద్యఆరోగ్యశాఖాధికారి భాస్కరరావు ఆదేశించారు. గురువారం మండలంలోని దబ్బగుంటలో కొట్టాం పీహెచ్‌సీ వైద్యాధికారి శిరీష ఆధ్వర్యంలో మలేరియా వ్యతిరేక మాసోత్సవాలు నిర్వహించారు.

బీసీజీ వ్యాక్సిన్‌ను వినియోగించుకోవాలి


రికార్డులు పరిశీలిస్తున్న శశికాంత్

రామభద్రపురం:బీసీజీ వ్యాక్సిన్‌ను వినియోగించుకోవాలని స్టేట్ నోడల్ ఆఫీసర్ డాక్టర్ శశికాంత్ కోరారు. గురువారం మండలంలోని ఆరికతోట పీహెచ్‌సీని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 60 సంవత్సరాలు పైబడిన వారు, షుగర్, క్షయవ్యాధి ఉన్నవారు ఈవ్యాక్సిన్ వినియోగించుకోవడం వల్ల రోగ నిరోధక శక్తి మెరుగవుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఆరికతోట పీహెచ్‌సీ వైద్యాధికారి దీపక్, టీబీ సూపర్‌వైజర్ శ్రీదేవి, డీపీసీ కుమార్ పాల్గొన్నారు.

మురుగు నిల్వలు తొలగించండి

- చీపురుపల్లి ఆర్డీవో శాంతి మునిసిపల్ అధికారులకు ఆదేశం

రాజాం: కాలువల్లో మురుగు నీరు నిల్వలు తొలగించాలని చీపురుపల్లి ఆర్డీవో బి శాంతి మునిసిపల్‌అధికారులను ఆదేశించారు.గురువారం రాజాంలోని బొబ్బిలి రోడ్డులోని కమిషనర్ ఆధ్వర్యంలో చేపడుతున్న పారిశుధ్య పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముందస్తు పనుల వల్ల వ్యాధులు రావడానికి అవకాశం ఉండదని, వర్షం పడితే రోడ్డుపైకి మురుగునీరు ప్రవహిస్తుండడంతో ప్రజలు,ప్రయాణికులు పడుతున్నఇబ్బందులకు పరిష్కారం దొరుకుతుందని తెలిపారు. కాగా వర్షాలు కురిస్తే చెత్త చెదారం కాలువల్లోకి చేరడంతో పాటు మురుగునీరు ప్రధాన రోడ్డుపైకి ప్రవహిస్తుందని గుర్తించిన పురపాలక సంఘం కమిషనర్ జె.రామప్పలనాయుడు ఆధ్వర్యంలో గురువారం మురుగునీటి తొలగింపు పనులు చేపట్టారు కాలువలపై ఉన్న పలకలను తీయించి చెత్తను బయటకు తొలగించారు. మురుగునీరు ప్రధాన కాలువలు ద్వారా సక్ర మంగా వెళ్లిపోయేలా చర్యలు చేపట్టారు. చెత్తను సంపద కేంద్రానికి తరలించేలా చర్యలు తీసుకున్నారు. పురపాలక సంఘం పరిధిలోని ప్రధాన కాలువల్లో ఉన్న చెత్తను తొలగించేలా చర్యలు తీసుకుంటామని కమిషనర్ తెలిపారు. ఆయనతో పాటు ఏఈ భాగ్యలక్ష్మి, ఎస్‌ఐ చేగొండి ప్రసాద్ పనులు పరిశీలించారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

కొత్తవలస: పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని కొత్తవలస పీహెచ్‌సీ వైద్యాధికారి సీతల్‌వర్మ సూచించారు. గురువారం మండలంలోని దెందేరులో జడ్పీహైస్కూల్ విద్యార్థులకు మలేరియా, డెంగ్యూ జ్వరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గ్రామంలో ర్యాలీ చేశారు. కార్యక్రమంలో జేవీ ప్రసాదరావు పాల్గొన్నారు.

చట్ట ప్రకారం చర్యలు చేపట్టాలి

- నిర్మాణంలో ఉన్న వైసీపీ కార్యాలయం పరిశీలించిన ఎమ్మెల్యే అదితి


నిర్మాణంలో ఉన్న కార్యాలయం వద్ద పరిసరాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

విజయనగరం రూరల్: వైసీపీ కార్యాలయాల నిర్మాణ విషయంలో రెవెన్యూ అధికారులు చట్టప్రకారం చర్యలు చేపట్టాలని విజయనగరం ఎమ్మెల్యే అదితి గజపతిరాజు కోరారు. గురువారం విజయనగరంలోని రింగురోడ్డు ప్రాంతంలో నిర్మాణం జరుగుతున్న వైసీపీ కార్యాలయ సముదాయాన్ని అదితి గజపతిరాజు టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రింగురోడ్డులో నిర్మాణం జరుగుతున్న వైసీపీ కార్యాలయం విషయంలో ఎందుకు గోప్యత పాటించారన్నారు. ఎకరాస్థలంలో కార్పొరేట్‌స్థాయిలో నిర్మిస్తున్న వైసీపీ కార్యాలయం విషయంలో గతంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు నిరసన తెలిపారన్నారు. తెలుగు యువ నాయకుడు గంటారవి సమాచారహక్కు చట్టం ద్వారా దరఖాస్తు చేసినా, అప్పటి ప్రభుత్వం స్పందించలేదన్నారు. వైసీపీ కార్యాలయం విషయంలో ఆర్టీఐద్వారా మరిన్ని వివరాలను సేకరించనున్నట్టు చెప్పారు.అనుమతు ల్లేకుండా నిర్మాణాలు చేపడుతున్నా రెవెన్యూఅధికారులు చూస్తూ ఉండిపోయారన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఐవీపీ రాజు, ప్రసాదుల ప్రసాద్, గంటా పోలినాయుడు, విజ్జపు ప్రసాద్, కంది మురళీనాయుడు, కర్రోతు నర్సింగరావు, పిల్లా విజయ్‌కుమార్, అవనాపు విజయ్, బీజేపీ నాయకుడు భవిరెడ్డి శివప్రసాద్‌రెడ్డి, తెలుగుయువత నాయకులు గంటా రవి, పీతల కోదండరామ్ తెలుగుయువత నాయకులు, టీఎస్ఎస్ఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

ముంపు ప్రాంతం పరిశీలన

మాజీ ఎమ్మెల్యే వీరభద్రస్వామి అక్రమకట్టడాలను ప్రోత్సహించడంలో పట్టభద్రుడు అయ్యారని ఎమ్మెల్యే అదితి గజపతిరాజు విమర్శించారు. విజయనగరంలోని రాజీవ్‌నగర్‌లో పదిళ్లల్లోకి వర్షం, కాలువ నీరు చేరడంతో ముంపు ప్రాంతాన్ని గురువారంరాత్రి పరిశీలించారు.ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ 2019 నుంచి ఇక్కడ వైసీపీ సానుభూతిపరుడికి మాజీ ఎమ్మెల్యే కోలగట్ల అభయాస్తం ఇచ్చి, ఇక్కడ అక్రమ కట్టడాన్ని ప్రోత్సహించారని, దీంతో ఇక్కడ ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. నగరంలోని చాలా ప్రాంతాల్లో కోలగట్ల అక్రమ కట్టడాలను ప్రోత్సహించారని, దీంతోవర్షాకాలంలో ముంపునకు గురయ్యేఅవకాశాలు ఉన్నాయని ఆందోళన వ్యక్తంచేశారు. ఆమె వెంట టీడీపీ నాయకుడు సారిక వెంకట రమణ ఉన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలి

- శృంగవరపుకోట ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి


కలెక్టర్ అంబేద్కర్‌తో మాట్లాడుతున్న లలిత కుమారి

శృంగవరపుకోట: నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలని శృంగవరపుకోట ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి కోరారు.ఈ మేరకు ఇటీవల కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన బీఆర్‌అంబేద్కర్‌ను గురువారం లలితకుమారి కలిశారు. నియోజకవర్గ అభివృద్ధిపై చర్చించారు. విజయనగరం ఎమ్మెల్యే అతిది గజపతిరాజును కూడా కలిశారు.ఆమెవెంట టీడీపీరాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కోళ్లబాలాజీ అప్పలరామ ప్రసాద్, ఎల్.కోట జడ్పీటీసీ మాజీ సభ్యుడుకరెండ్ల ఈశ్వరరావు, మాజీ ఎంపీపీ కొల్లి రమణమూర్తి, వేపాడ మండల పార్టీ ప్రధాన కార్యదర్శి కోట్యాడ రమణమూర్తి, నాయకులు కోళ్ల శ్రీను, రత్నాజీ, లాలం అర్జునరావు దుర్గా ఉమేష్ ఉన్నారు.

బొబ్బిలి రాజులు శ్రీకృష్ణదాసులు కావడం పూర్వజన్మ సుకృతం

- ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త చాగంటి కోటేశ్వరరావు


శ్రీకృష్ణపరమాత్ముని లీలలను భక్తులకు వివరిస్తున్న చాగంటి కోటేశ్వరరావు

బొబ్బిలి:శ్రీకృష్ణపరమాత్మసేవలో బొబ్బిలి రాజులు తరిస్తుండడం వారి పూర్వజన్మ సుకృతమని ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త చాగంటి కోటేశ్వరరావు తెలిపారు. గురువారంరాత్రి బొబ్బిలి శ్రీవేణుగోపాలస్వామి ఆలయాన్ని చాగంటి దంపతులు దర్శించుకున్నారు. వారికి ఆలయలాంచనాలతో ఎమ్మెల్యే, అనువంశిక ఆలయ ధర్మకర్తల ప్రతినిధి ఆర్‌వీఎస్‌కేకే రంగారావు (బేబీనాయన), అర్చకులు ఆలయ లాంచనాలతో ఘనంగా స్వాగతంపలికారు. ఆలయ చరిత్ర, విశిష్టత, వైభవం, పూజాది కార్యక్రమాల్లో అనుసరించే పద్ధతులను అర్చకులతో పాటు బేబీనాయన ఆయనకు వివరించారు. అనంతరం ఆలయ మండపంలో వేదమంత్రాలతో పండితులు చాగంటికి ఆశీర్వచనాలు అందజేశారు. అనంతరం భక్తులను ఉద్దేశించి చాగంటి ప్రసంగించారు.వేణుగానం గొప్పతనాన్ని వివరించారు. వేణుగోపాలుని ఉపాసన చేయడం ఎంతో శక్తివంతమైనదన్నారు.రాజవంశానికి చెందిన బేబీనాయన ఎమ్మెల్యేగా ఉంటూ ఆయన కుటుంబమంతా స్వామివారి సేవలో దర్శించడం ఎంతో పూర్వజన్మ ఫలమన్నారు.

జీవో-117 రద్దుచేయాలి

- ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ


మాట్లాడుతున్న రఘువర్మ

రామభద్రపురం: ప్రాథమిక విద్యను నాశనం చేసిన 117వ జీవోను తక్షణమే రద్దుచేయాలని ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ కోరారు. గురువారం మండలంలోని నాయుడువలస పాఠశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యా, ఉపాధ్యాయరంగ సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకోవాలని కోరారు. ఏపీటీఎఫ్ రాష్ట్ర అకడమిక్ కన్వీనర్ జేసీరాజు మాట్లాడుతూ ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న అన్ని సమస్యలు పరిష్కరించాలని కోరారు.కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షుడు జోగినాయుడు,ప్రధానోపాధ్యాయులు ఎం.నాగభూషణం, ఏపీటీఎఫ్ సంఘ నాయకులు రెడ్డివేణు, శేఖర్, శివున్నాయుడు, బొప్పే రవి, కృష్ణంనాయుడు పాల్గొన్నారు.

పారిశుధ్యంపై అప్రమత్తంగా ఉండాలి

లక్కవరపుకోట: పారిశుధ్యం, తాగునీటి సరఫరా విషయాల్లో అప్రమత్తంగా ఉండాలని అధికారులకు ఎంపీడీవో కే.రూపేష్ ఆదేశించారు. గురువారం ఖాసాపేటలో పారిశుధ్యం,మంచినీటి సరఫరాపై తనిఖీ నిర్వహించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ వర్షాలు కురుస్తుండడంతో వ్యాధులు ప్రబలే అవకాశముందని తెలిపారు. కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ జ్ఞానేశ్వరరావు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

చేయూత డబ్బులు జమచేయాలి

- విజయనగరంలో మహిళల నిరసన

విజయనగరం దాసన్నపేట: చేయూత నాలుగో విడత డబ్బులు అర్హులైన లబ్ధిదారుల ఖాతాలో తక్షణమే జమ చేయాలని ఐద్వా పట్టణ కార్యదర్శి లక్ష్మి, సీఐటీయూ అధ్యక్షుడు జగన్మోహన్ డిమాండ్ చేశారు.ఈమేరకు విజయనగరంలోని 41వ సచివాలయం వద్ద నిరసన తెలిపి, సచివాలయ కార్యదర్శికి వినతిపత్రంఅందజేశారు. ఈసందర్భంగావారు మాట్లాడుతూ గతముఖ్యమంత్రి నాలుగో విడత చేయూత డబ్బులు 18,750 రూపాయలు బటన్ నొక్కినా, ఎన్నికల కోడ్ వల్ల లబ్ధిదారుల ఖాతాలో జమకాలేదని తెలిపారు.తక్షణమే ప్రభుత్వం అర్హులైన వారికి డబ్బులుచెల్లించే చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో లక్ష్మి, రాజమ్మ, కొండమ్మ, మంగమ్మ, జ్యోతి, సత్యవతి, నారాయణమ్మ పాల్గొన్నారు.

పుస్తకాల విక్రయాన్ని అరికట్టాలి

- ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్



నిరసన తెలుపుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

కలెక్టరేట్: జిల్లాలోని కార్పొరేట్, ప్రైవేటు విద్యా సంస్థల్లో సంస్థల పేరుమీద పుస్తకాలు ప్రింట్‌చేసి పాఠశాల ఆవరణలో విక్రయించి విద్యార్థుల తల్లిదండ్రులను దోచుకుంటున్నారని, ఆ పుస్తకాల విక్రయం అరికట్టాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్‌చేశారు.ఈ మేరకు గురువారం కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు మాట్లాడుతూ ప్రైవేటు పాఠశా లల్లో పుస్తకాలు విక్రయించడంపై తాము అడ్డుకుని విద్యాశాఖ అధికారులకు తెలియజేస్తే వాటిని సీజ్ చేసి నాలుగు రోజులు తరువాత తిరిగి పుస్తకాలు విక్రయిస్తున్నారని ఆరోపించారు. ఇటువంటి కార్యకలపాలుపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విజయనగరం పట్టణంలోని ఓ కార్పొరేట్ స్కూల్ భవనాలు నిర్మాణం పూర్తికాకుండా తరగతులు నిర్వహిస్తున్నారని, దీనిపై చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం డీఆర్వో అనితకు వినతి పత్రం సమర్పించారు.

మరమ్మతులు చేయరు.. వినియోగంలోకి రావు

- ఇదీ రాజాం ఏరియా ఆస్పత్రిలో 104 వాహనాల పరిస్థితి


మూలకుచేరిన 104 వాహనాలు

రాజాం: రాజాం ఏరియా ఆసుపత్రి ఆవరణలో104 వాహనాలు నిరుపయోగంగా పడిఉన్నాయి. వైసీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో 104 వాహనాలు పాడయ్యాయి. వీటిని కొద్దిపాటి మరమ్మతులు చేస్తే వినియోగంలోకి వచ్చే అవకాశం ఉంది. అయితే అప్పటి పాలకులు వీటి మరమ్మతులపై దృష్టిసారించకపోవడంతో ప్రస్తుతం వినియోగించడానికి వీల్లేకుండా మారాయి. ఏరియా ఆసుపత్రి ఆవరణలో పురపాలక సంఘం కార్యాలయానికిఆనుకొని ఉన్న వాహనాలను ఏరియా ఆసుపత్రి లోపలకు తరలించారు.నియోజకవర్గానికి కేటాయించిన నాలుగు వాహనాలకు ఒక్క వాహనం మాత్రమే పనిచేస్తోంది. ఆరోగ్య శాఖ అధికారులు ఈ ఒక్క వాహనంతోనే సేవలందిస్తున్నారు. తక్షణమే అధికారులు చర్యలు తీసుకొని 104 వాహనాలను వినియోగంలోకి తీసుకువచ్చి వైద్య సేవలందించాలని పలువురు కోరుతున్నారు.

గ్రామాల్లో రాత్రిపూట పహారా

లక్కవరపుకోట:గ్రామాల్లో ఎట్టకేలకు పోలీసులు రాత్రి పూట పహారా కాస్తున్నారు. ఈనెల 25న గోల్డ్‌స్టార్-కల్లేపల్లి మార్గంలో దొంగల భయం శీర్షికతో కథనం ప్రచురితమయ్యింది. దీంతో పోలీసులు ఈనెల 24న దొంగతనానికి గురైన రెండు ద్విచక్రవాహనాలు స్వాధీనం చేసుకుని నిందితులను అరెస్టు చేశారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎస్ఐ ఆర్.గోపాలరావు ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది గోల్డ్‌స్టార్-కల్లేపల్లి మార్గంలో నిఘాపెంచారు.

నెల్లిమర్లలో వర్షం

నెల్లిమర్ల: నెల్లిమర్లలో గురువారం మధ్యాహ్నం సుమారు రెండు గంటల పాటు వర్షం కురిసింది. గత కొద్దిరోజులుగా ఎండలతో విలవిల్లాడుతున్న ప్రజలు గురువారం కురిసిన వర్షానికి ఉపశమనం పొందారు. పొలాలోనూ, చెరువుల్లోనూ నీరు చేరింది. దీంతో ఖరీఫ్‌లో వ్యవసాయ పనులు ఊపందుకోనున్నాయి. వర్షం ఎదలు, వరి నారు మడులకు ఎంతగానో ఉపయోగపడుతుందని పలువురు రైతులు తెలిపారు.

హెలెన్ కెల్లర్‌కు నివాళి

బాడంగి: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బాడంగిలో హెచ్ఎం దత్తి సత్యనారాయణ ఆధ్వర్యంలో హెలెన్‌కెల్లర్ 144వ జయంతి పురస్కరించుకుని పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం మాట్లాడుతూ హెలెన్ కెల్లర్ చూపు కనిపించకపోయినా, వినికిడిలోపం ఉన్నా, ప్రపంచంలో మొట్టమొదటి అంధ వినికిడి లోపం గ్రాడ్యుయేట్‌గా అత్యున్నత శిఖరాలను అధిరోహించారన్నారు. కార్యక్రమంలో ప్రత్యేక ఉపాధ్యాయులు కొల్లి ఈశ్వరరావు, ఉపాధ్యాయులు డాకేటి రమేష్, కురిటి తిరుపతిరావు, సత్యనారాయణ, లక్ష్మి పాల్గొన్నారు.

లోక్‌సభ స్పీకర్‌కు అభినందన


దీక్షలు చేస్తున్న కార్మికులు

విజయనగరం: లోక్‌సభ స్పీకర్‌గా రెండోసారి ఎన్నికైన ఓంబిర్లాకు విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు అభినందించారు. గురువారం స్పీకర్ కార్యాలయంలో కలిశారు. రెండోసారి స్పీకర్ పదవికి ఎన్నిక కావడం గొప్పవిషయమని, 17వ లోక్‌సభను సమర్థవంతంగా నడిపించారని కొనియాడారు.

కర్మాగారాన్ని తెరిపించాలి

కొత్తవలస:తమ సమస్యను పరిష్కరించడానికి ప్రజా ప్రతినిధులు, అధికారులు చొరవతీసుకొని కర్మాగారం తెరిపించాలని జిందాల్‌నగర్‌లోని జేఎస్ఎల్ కార్మిక సంఘాలకు చెందిన నాయకులు పిల్లా అప్పలరాజు, నమ్మి చినబాబు, లగుడు వామాలు కోరారు. గురువారానికి కర్మాగార యాజమాన్యం లాకౌట్ విధించి 41 రోజులకు చేరుకుంది. ఈ మేరకు అప్పటి నుంచి కార్మికులు కర్మాగారం మెయిన్ గేట్ ఎదుట శిబిరాన్ని ఏర్పాటు చేసుకుని నిరసన దీక్షలు చేస్తున్నారు.ఆరు రోజులుగా రిలేదీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లాకౌట్ ఎప్పుడు ఎత్తివేస్తారో, అసలు కర్మాగారం తెరుస్తారో, తెరవరో తెలియని పరిస్థితిలో ఉండడంతో కార్మికులకు అప్పులు కూడా దొరకని పరిస్థితి నెలకొందన్నారు.

విద్యార్థుల్లో దేశభక్తి పెంపొందించాలి

తెర్లాం:స్కూల్ అసెంబ్లీ ద్వారా విద్యార్థుల్లో దేశ భక్తి, నైతిక విలువలు పెంపొందేలా చర్యలు తీసుకోవాలని స్కూల్ యాజమాన్యానికి ఎంఈవో త్రినాథరావు కోరారు.గురువారం మండలంలో ఎంఆర్‌పురం పాఠశాలను పరిశీలించారు. ఈసందర్భంగా ఒకటో తరగతి విద్యార్థులకు అమలుచేస్తున్న విద్యా ప్రవేశ్ 90 రోజు లు కార్యక్రమం యాక్టివిటిపై సూచనలుచేశారు. పీఎం పోషన్ ద్వారా పిల్లలకు మెను ప్రకారం నాణ్యమైన ఆహారాన్ని అందించాలని అదేశించారు. ఆర్వో ప్లాంటు మరమ్మతులు చేపట్టాలని కోరారు.

సక్రమంగా సరుకులు పంపిణీ చేయాలి

బాడంగి:లబ్ధిదారులకు సక్రమంగా సరుకులు పంపిణీ చేయాలని తహసీల్దార్ రాజారావు కోరారు. గురువారం బాడంగిలో డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డీలర్లంతా రేషన్ దుకాణాలను సక్రమంగా తెరవాలని కోరారు.


మాట్లాడుతున్న తహసీల్దార్ రాజారావు

మంత్రి సంధ్యారాణికి ఘన స్వాగతం


మంత్రి సంధ్యారాణికి స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యేలు

పార్వతీపురం, ఆంధ్రజ్యోతి: రాష్ట్ర గిరిజన, స్త్రీ శిశు సంక్షేమ శాఖా మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత మొట్టమొదటి సారిగా జిల్లా కేంద్రంలోని టీడీపీ కార్యాలయానికి గురువారం వచ్చిన సంధ్యారాణికి అపూర్వ స్వాగతం లభించింది. పార్వతీపురం, పాలకొండ, కురుపాం ఎమ్మెల్యేలు బోనెల విజయ చంద్ర, నిమ్మక జయకృష్ణ, తోయక జగదీశ్వరి ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు మంత్రిని ఘనంగా స్వాగతించారు. ఆమెతో పాటు ఎమ్మెల్యేలు ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు నివాళులు అర్పించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికి సభా మర్యాదలు పాటించడం తెలియదని ఆరోపించారు. ప్రజలు వైసీపీకి 11 సీట్లు ఇచ్చారని, అటువంటిది శాసనసభలో జగన్‌కు ఎలా ప్రతిపక్షనాయకుని హోదా ఎలా దక్కుతుందని మంత్రి ప్రశ్నించారు. వైసీపీ ప్రభుత్వ కాలంలో ఆ పార్టీ నాయకులు, మంత్రులు రాష్ట్రంలోని పంచ భూతాలను మింగేశారని మంత్రి ఆరోపించారు. ఇసుక దోపిడీ, నాసిరకం మద్యం సరఫరా, అక్రమ గనుల తవ్వకాలను చేపట్టారన్నారు. ఎమ్మెల్యే విజయచంద్ర మాట్లాడుతూ మంత్రి ఆధ్వర్యంలో జిల్లా అన్ని విధాలా అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపు రెడ్డి శ్రీనివాసరావు, టీడీపీ నాయకులు బార్నాల సీతారాం, గొట్టాపు వెంకటనాయుడు, సత్యం, రౌతు వేణు, పెంకి వేణుగోపాల్‌నాయుడు, పోరాడ నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

రైతు సమస్యలు పరిష్కరించాలి



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలియజేస్తున్న దృశ్యం

పాలకొండ: జిల్లాలోని రైతుల సమస్యలను పరిష్కరించాలని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బుడితి అప్పలనాయుడు డిమాండ్ చేశారు. రైతు సంఘ నాయకులతో కలిసి గురువారం స్థానిక కలెక్టర్ ఎదుట ధర్నా చేశారు. అనంతరం డీఆర్వో కేశవనాయుడుకు వినతిపత్రం అందించారు. ఈసందర్భంగా అప్పలనాయుడు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రకటించిన సాగు సాయం రైతుకు రూ.20వేలు ఈ ఖరీఫ్‌లోనే అందించేందుకు కృషి చేయాలన్నారు. పెరిగిన ఉత్పత్తి ఖర్చులకు అనుగుణంగా స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ పెంచి పంట రుణాలు మూడు లక్షల వరకు వడ్డీ లేకుండా రూ.5లక్షల వరకు పావలా వడ్డీతో ఇవ్వాలన్నారు. జిల్లాలో ప్రాజెక్టుల కింద తోటపల్లి, వెంగళరాయ, జంఝావతి, ప్రధాన కాలువలు, మైనర్ కాలువ మరమ్మతులు చేపట్టాలన్నారు. నూతనంగా ఏర్పడిన ప్రభుత్వం స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలని కోరారు. ఏనుగుల దాడిలో మరణించిన రైతు కుటుంబాలకు రూ.15లక్షలు, గాయపడిన వారికి రూ.5లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలన్నారు. ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయ రంగానికి అనుసంధానం చేయాలని కోరారు. వినతిపత్రం అందించిన వారిలో రైతు సంఘం నాయకులు వెలమల సత్యనారాయణ, ఈవీ నాయుడు, బుడితి శంకరరావు, తోట జీవన్, పోలురోతు చంద్రశేఖర్, పాశర్ల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

దళితులపై దాడి తగదు


పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న దృశ్యం

గరుగుబిల్లి: మండలంలోని శివ్వాం గ్రామానికి చెందిన దళితులపై దాడులు చేసిన వారిపై చర్యలు చేపట్టాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కె.గంగునాయుడు డిమాండ్ చేశారు. గురువారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడారు. 1970లో శివ్వాం గ్రామానికి చెందిన 14 మంది సుమారు 25 ఎకరాల భూమికి పట్టాలు పొందారన్నారు. పట్టాల మేరకు కేటాయించిన భూముల్లో వ్యవసాయం చేసుకుంటున్నారని చెప్పారు. అయితే భూముల్లో ఉన్న వారిపై గురువారం ఆయుధాలతో దాడి చేయడం విచారకరం అన్నారు. సుమారు 9 మంది పెత్తందారులు దాడులకు పాల్పడ్డారని, వీరిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ మేరకు మండల పోలీసులకు ఫిర్యాదు చేశారు. దళితులు సాగు చేసుకుంటున్న భూమిని దురాక్రమణ చేయడానికి పలువురు పన్నాగాలు చేస్తున్నారన్నారు. ఎస్సీ కులానికి చెందిన రేగిడి దుర్గపై దాడులు చేశారని చెప్పారు. అధికారులు స్పందించి దళితులను ఆదుకోవాలని ఆయన కోరారు.

మా పోస్టులను డీఎస్సీలో కలపొద్దు


ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

గుమ్మలక్ష్మీపురం: తమ పోస్టులను డీఎస్సీలో కలిపి తమ కుటుంబాలను అంధకారంలోకి నెట్టొద్దని గిరిజన గురుకుల విద్యాలయాల ఔట్‌సోర్సింగ్ ఉపాధ్యాయ సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు గురువారం కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరిని గుమ్మలక్ష్మీపురంలోని తన నివాసంలో కలిసి వినతిపత్రం సమర్పించారు. తాము గిరిజన గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో రెగ్యులర్ ఉపాధ్యాయులుగా, పలు రకాల అదనపు ఇన్‌చార్జి విధులు కూడా నిర్వహిస్తున్నామ చెప్పారు. తాము పనిచేస్తున్న పోస్టులు జోనల్ స్థాయిలో ఉన్నాయని, ఆయా పోస్టులను డీఎస్సీలో కలిపేందుకు అవకాశం లేదని వివరించారు. త్వరలో జారీ చేయబోయే డీఎస్సీకి ఈ పరిస్థితుల్లో సన్నద్ధం కాలేమని, కాబట్టి తమను ముఖ్యమంత్రి, విద్యాశాఖామంత్రి, గిరిజన సంక్షేమశాఖామంత్రుల దృష్టికి తీసుకెళ్లి తమకు సీఆర్టీలుగా పరిగణించి జీతాలను పెంపుదల చేయాలని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు తిరుపతిరావు, నాగేశ్వరరావు, గిరిజ, దివాకర్, శ్రీనివాసరావు, వెంకటరమణ, బంగారు రాజు, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

సీఆర్టీలు, సవర విద్యా వలంటీర్లను పునః నియమించాలి


మాట్లాడుతున్న బాలకృష్ణారావు

జియ్యమ్మవలస: గిరిజన సంక్షేమ పాఠశాలల్లో గతంలో పనిచేసిన కాంట్రాక్టు రెసిడెంట్ టీచర్లను, సవర విద్యా వలంటీర్లను పునః నియమించాలని ఏపీటీఎఫ్ జిల్లా శాఖ ప్రధాన కార్యదర్శి నల్ల బాలకృష్ణారావు కోరారు. గురువారం ఆయన మండలంలోని వనజ గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ ఉన్నత పాఠశాలలో విలేకర్లతో మాట్లాడారు. పాఠశాలలు తెరుచుకుని 15 రోజులు గడుస్తున్నా నేటికీ వారిని ఆయా పాఠశాలల్లో కొనసాగించకపోవడం వల్ల విద్యార్థుల బోధనకు విఘాతం కలుగుతుందన్నారు. కావున వారిని నియమించడానికి తగిన చర్యలు తీసుకోవాలని గిరిజన సంక్షేమ ఉపాధి, అభివృద్ధి అధికారిని కోరుతున్నామన్నారు. అలాగే 117 జీవోను రద్దు చేసి ఉన్నత పాఠశాలల్లో విలీనం చేసిన 3, 4, 5 తరగతులను తిరిగి ప్రాథమిక పాఠశాలల్లో చేర్చాలని ప్రభుత్వాన్ని కోరామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల శాఖ ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాసరావు, జిల్లా అకాడమీ కన్వీనర్ నరసింహ చౌదరి, శ్రీనివాసరావు, శంకరరావు, రంగయ్య తదితరులు పాల్గొన్నారు.

రావుపల్లిలో ఉపాధి గ్రామసభ

గరుగుబిల్లి: రావుపల్లిలో ఉపాధి హామీ పనులకు సంబంధించి చేపట్టిన సామాజిక తనిఖీపై గురువారం గ్రామ సభ నిర్వహించారు. ఈసందర్భంగా సామాజిక తనిఖీ బృందం డీఆర్పీ శివ మాట్లాడుతూ పంచాయతీలో చేపట్టిన పనులపై తనిఖీ చేసి, అనంతరం గ్రామసభ నిర్వహించామని చెప్పారు. ఎంపీడీవో కార్యాలయంలో ప్రజావేదిక నిర్వహిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో సర్పంచ్ మఠ్రాపు మహేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి బలగ వెంకటసాయికృష్ణ, సాంకేతిక సహాయకుడు మఠ్రాపు ఉమామహేశ్వరరావు, క్షేత్ర సహాయకుడు మఠ్రాపు శంకరరావు, తదితరులు పాల్గొన్నారు.

ఆ మున్సిపాల్టీకి ఏమైంది?




సాలూరు మున్సిపల్ కార్యాలయం

- మూడేళ్లు పూర్తవుతున్నా కానరాని అభివృద్ధి జాడ
- నామమాత్రంగానే సాధారణ సమావేశాలు
- ఇదీ సాలూరు పరిస్థితి

సాలూరు: ఆ మున్సిపాల్టీకి ఏమైంది.. రాష్ట్రంలోనే అతి పురాతన మున్సిపాల్టీగా అవతరించిన సాలూరు అభివృద్ధికి నోచుకోవడం లేదు. నాయకులు, అధికారుల తీరుతో 14వ ఆర్థిక సంఘం నిధులు రూ.4కోట్ల50లక్షలు వెనక్కి పోయాయి. గడప గడపకు మన ప్రభుత్వంలో భాగంగా మున్సిపాల్టీలోని 14 సచివాలయాల పరిధిలో 170 పనులకుగాను రూ.5 కోట్ల 60లక్షలు నిధులు మంజూరు కాగా, కేవలం 26 పనులు మాత్రమే పూర్తయ్యాయి. దీంతో రూ.77లక్షలు మాత్రమే ఖర్చయ్యాయి. మిగతా పనులు అస్సలు మొదలు కాకపోవటంతో నిధులు మళ్లీ వెనక్కి పోయాయి. 15వ ఆర్థిక సంఘానికి సంబంధించి గడిచిన మూడేళ్లలో 94 ప్రతిపాదిత పనులకుగాను రూ.7.97కోట్లు మంజూరు కాగా, కేవలం 32 పనులు మాత్రమే పూర్తి జరగటంతో రూ.కోటి 86 లక్షలు మాత్రమే ఖర్చు అయ్యాయి. పెద్దబజార్ అభివృద్ధికి ఐడీఎస్ఎంటీ సుమారు రూ.40లక్షల నిధులు బ్యాంకుల్లో మూలుగుతున్నాయని అధికారులు చెబుతున్నారు. పట్టణ ప్రజలకు తాగునీరు అందించేందుకు ఏఐఐబీ నిధులు రూ.68.98 కోట్ల నిధులకు సంబంధించి పట్టణ నడిబొడ్డున ఎంతో అట్టహాసంగా పైలాన్ ఏర్పాటు చేశారు. అయితే కాంట్రాక్టర్ తెచ్చిన పైపులకు సంబంధించి బిల్లులు చెల్లించకపోవటంతో పనులు నిలిచిపోయాయి.

పన్నుల భారం..

గత ప్రభుత్వంలో మున్సిపాల్టీ పరిధిలో ప్రజలకు బొబ్బిలి, పార్వతీపురం మున్సిపాల్టీలు కంటే ఎక్కువ చెత్త పన్ను చెల్లించేలా అధికారులు నాయకులతో తీర్మానం చేయించారు. అంతేకాకుండా ఇంటి పన్ను, ఆస్తి పన్నులు చెల్లించాలని నిత్యం ప్రజలపై ఒత్తిడి పెట్టారు.

చేతివాటం..

ఇక్కడ పని చేసిన ఓ ముఖ్య అధికారి లంచం తీసుకుంటూ పట్టుబడ్డారు. క్షేత్ర స్థాయిలో పనిచేసే సిబ్బంది కూడా నిత్యం చేతివాటం ప్రదర్శిస్తున్నారనే విషయం జగమెరిగిన సత్యం. మున్సిపాల్టీలో అపార్ట్‌మెంట్‌లు, ఖాళీ స్థలాలపై పన్నులు వేయాలని పాలకవర్గ సభ్యులు ఎన్నిసార్లు చెప్పినా అధికారులు పట్టించుకునే దాఖలాలు లేవు.

ఏం ప్లాన్ చేస్తున్నారో అర్థం కావటం లేదు

మున్సిపాల్టీలో ప్లానింగ్ విభాగం పూర్తిగా పడకేసింది. మున్సిపాల్టీలో నిర్మిస్తున్న కట్టడాల విషయంలో పేదోడుకి ఒకలా.. పెద్దోడికి ఒకలా నిబంధనలు ఉంటాయి. మున్సిపాల్టీలో ఉన్న అనేక షాపింగ్‌లకు లాడ్జీలకు, షాపింగ్ కాంప్లెక్స్‌లకు, రెస్టారెంట్లకు పార్కింగ్ స్థలాలు లేవు. ఎక్కడపడితే అక్కడే వాహనాలు పార్కింగ్ చేయటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. నిబంధనలకు విరుద్ధంగా చేసే నిర్మాణాలను పట్టించుకోవడం లేదు

ఎవరికీ పట్టని పెద్దబజార్

మున్సిపాల్టీకి గుండె కాయలాంటి పెద్దబజార్‌ను అధికారులు, నాయకులు అస్సలు పట్టించుకోవటం లేదు. ఇక్కడ సుమారు 200 షాపులు ఉన్నాయి. ఒక యజమాని పేరుతోనే అనేక షాపులు ఉన్నాయి. దీంతో ఆ యజమాని పరిస్థితి మూడు పువ్వులు ఆరు కాయలుగా ఉంది. పెద్దబజార్‌ను ప్రక్షాళన చేయాలని ఎన్నిసార్లు సమావేశాలు పెట్టి చర్చలు జరిపినా కార్యరూపం దాల్చటం లేదు. బజార్‌లో అనేక షాపులు శిథిలావస్థకు గురయ్యాయి. గతంలో ఓ గోడౌన్ గోడ కూలిపోవటంతో పూడి గోపి, వెంకటరమణ తీవ్ర గాయాల పాలయ్యారు. శిథిలావస్థకు గురైన షాపులను తక్షణం జేసీబీలతో తొలగించాలని గతంలో పాలకవర్గం తీర్మానం చేసింది. కానీ కార్యరూపం దాల్చలేదు.

సెలవుపై వెళ్లిన కమిషనర్

సాధారణ ఎన్నికల ముందు ఇక్కడ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన పి.ప్రసన్నవాణి తన స్థాయిని తగ్గించి ఇక్కడ కమిషనర్‌గా వేశారని ఎన్నోసార్లు విలేకర్ల ముందు వాపోయారు. ఈ నేపథ్యంలో ఆ పోస్టులో అసంతృప్తిగా ఉన్న కమిషనర్ ఈనెల 24న కలెక్టర్‌ను కలిసి తాను 15 రోజులు సెలవుపై వెళ్తున్నట్టు తెలిపారు. దీంతో మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్‌గా డీఈ శ్రీరామమూర్తి బాధ్యతలు స్వీకరించారు.

రేపు మున్సిపల్ సర్వసభ్య సమావేశం

సాధారణ ఎన్నికల తర్వాత ఎన్నికల కోడ్ ముగియటంతో ఈనెల 29న మున్సిపల్ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్టు మున్సిపల్ అధికారులు తెలిపారు. అయితే కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత జరుగుతున్న మొదటి సర్వసభ్య సమావేశం కావటతో ఎలా ఉండబోతుందోనని ఆసక్తిగా ఉంది.

ఎమ్మెల్యే జయకృష్ణకు జన నీరాజనం


వీరఘట్టంలో ప్రజలకు అభివాదం చేస్తున్న జయకృష్ణ

పాలకొండ/వీరఘట్టం: పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణకు జన నీరాజనం పలికారు. పార్వతీపురం నుంచి పాలకొండ వరకు అడుగడుగునా కూటమి నాయకులతో పాటు కార్యకర్తలు, మహిళలు ఘన స్వాగతం పలికారు. పూల వర్షం కురిపించారు. ఎమ్మెల్యేగా ఎన్నికైన తర్వాత ప్రమాణ స్వీకారం చేసి నియోజకవర్గానికి వస్తున్న తరుణంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు విజయోత్సవ ర్యాలీ చేశారు. ఈ ర్యాలీ పార్వతీపురంలో సాయంత్రం నాలుగు గంటలకు ప్రారంభమై రాత్రి 8.30 గంటలకు పాలకొండకు చేరింది. ర్యాలీ ప్రారంభం నుంచి భారీ వర్షం కురుస్తున్నప్పటికీ ఆయన వెంట వేలాదిగా కార్యకర్తలు, నాయకులు తరలివచ్చారు. వీరఘట్టంకు చేరుకున్న జయకృష్ణకు స్థానిక నాయకులు పూలమాలలు, బొకేలతో సత్కరించారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కర్నేన అప్పలనాయుడు ఆధ్వర్యంలో పార్టీ మండల అధ్యక్షుడు ఉదయాన ఉదయ్‌భాస్కర్, పొదిలాపు కృష్ణమూర్తినాయుడు, జామి లక్ష్మీనారాయణ తదితరులు దుశ్శాలువతో సత్కరించారు. అనంతరం ఆయన పాలకొండకు చేరుకున్నారు. పాలకొండలో టీడీపీ సీనియర్ నాయకుడు పల్లా కొండలరావు, పార్టీ పట్టణ అధ్యక్షుడు గంటా సంతోష్‌కుమార్, పార్టీ మండల అధ్యక్షుడు గండి రామినాయుడు ఆధ్వర్యంలో గజమాలతో సత్కరించారు. ఏలాం సెంటర్ వరకు ఈ ర్యాలీ కొనసాగింది. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు నిమ్మక పాండురంగ, సనపల చౌదరినాయుడు, జగ దీశ్వరరావు, వెన్నపు శ్రీనివాసరావు, కనపాక చౌదరినాయుడు, కర్నేన యోగిత, తేజోవతి, సుంకరి అనీల్‌దత్, రుద్ర కోటేశ్వరరావు, దూబ వెంకటరమణ, హనుమంతు తమ్మారావు, సవర తోటముఖలింగం, బగాది సుశీల, జనసేన నాయకులు గర్భాన సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

అవినీతి రహిత పాలన అందిస్తాం

రాష్ట్రాన్ని వైసీపీ ప్రభుత్వం రావణకాష్టం చేసిందని కూటమి ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ అన్నారు. అవినీతి రహిత పాలన అందిస్తామని తెలిపారు. గతంలో జరిగిన భూకబ్జాలను వెలికి తీస్తామన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు. తనకు అభినందనలు తెలిపిన ప్రతిఒక్కరికీ పేరు పేరున కృతజ్ఞతలు తెలిపారు. రానున్న రోజుల్లో ప్రజా సమస్యల పరిష్కారానికి అసెంబ్లీలో ప్రస్తావిస్తానని భరోసా ఇచ్చారు.

మున్సిపల్ మార్కెట్ వేలం 12వ సారి వాయిదా

పార్వతీపురంటౌన్: మున్సిపల్ మార్కెట్ ఆశీలు బహిరంగ వేలం 12వ సారి వాయిదా పడింది. గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ కె.శ్రీనివాసరావు ఆదేశాల మేరకు మార్కెట్ ఆశీలుకు వేలం జరిగింది. మున్సిపల్ రెవెన్యూ అధికారి రూబేను బహిరంగ వేలం పర్యవేక్షణ అధికారిగా వ్యవహరించారు. ఈ ఏడాది జూలై 1వ తేదీ నుంచి వచ్చే ఏడాది మార్చి 30వ తేదీ వరకు 9 నెలల పాటు మార్కెట్ ఆశీలుకు సంబంధించి సర్కారు వారి పాట రూ.12లక్షలుగా నిర్ణయించారు. పారిశుధ్య నిర్వహణకు రూ.3.78లక్షలు, దీంతో పాటు జీఎస్టీ రూ.2లక్షలు చెల్లించాలని నిర్ణయించారు. దీంతో పాటదారులు అసంతృప్తి వ్యక్తం చేశారు. కరోనా సమయంలో మున్సిపాల్టీకి పన్నుల రూపంలో లక్ష రూపాయల్లో ఆదాయం చెల్లించామని, తమకు నష్టాలు వస్తున్నా పట్టించుకున్న అధికారులే లేరని పాటదారులు ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో పాటదారులు, మున్సిపల్ అధికారులు బహిరంగ వేలం పాటకు సంబంధించి కొంత సమయం చర్చలు జరిపినా ఫలితం లేకుండా పోయింది. దీంతో 12వ సారి బహిరంగ వేలం వాయిదా పడింది.

రమ్మంటున్నారు.. పొమ్మంటున్నారు

గత 12 సార్లు నుంచి మార్కెట్ వేలానికి రమ్మని, తమకు నచ్చిన విధంగా ఆశీలు వేలం పాట వసూలు చేసుకుంటామని చెప్పి, మళ్లీ పొమ్మని చెబుతుండడం బాధకరమని వేలం పాటదారులు గొర్లి శంకరరావు, బుడితి శ్రీనివాసరావులు ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో ఎవరో ఆశీలు కాంట్రాక్టర్ పొరపాటు చేశాడని, తమపై ఆశీలు పాటను అధికంగా విధించడం మంచిది కాదని పాటదాలు తమ బాధను వ్యక్తం చేశారు. ఈ విషయమై మున్సిపల్ కమిషనర్ కె.శ్రీనివాసరావును వివరణ కోరగా.. సర్కారు వారి పాట విషయమై పాటదారులు ఆశీలు వసూలుకు సంబంధించి వెసులు బాటును కోరుతున్నారని చెప్పారు. ఆ విషయమై సంబంధిత అధికారులతో చర్చించి తుది నిర్ణయం తీసుకుంటామని తెలిపారు.

బడిఈడు పిల్లలు బడిలోనే ఉండాలి


సీతంపేట: పెద్దూరులో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

సీతంపేట: బడిఈడు పిల్లలందరూ బడిలో ఉండాలని మండల విద్యాశాఖాధికారులు ఆనందరావు, సూర్యచంద్రరావు అన్నారు. పెద్దూరు గ్రామంలో గురువారం 'నేను బడికి పోతా' కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులతో కలిసి ర్యాలీ చేశారు. ప్రతిఒక్కరూ చదువుకుని ప్రభుత్వం నుంచి వచ్చే రాయితీలను పొందాలని సర్పంచ్ హిమరిక ఆదిలక్ష్మి చెప్పారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం సవర ప్రసాద్, ఉపాధ్యాయులు నెల్లి సత్యంనాయుడు, సచివాలయ సిబ్బంది శివ, గాయత్రీ, ప్రణీత పాల్గొన్నారు. **భామిని:** బడిఈడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలని ఎంపీడీవో కిశోర్‌కుమార్ కోరారు. గురువారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో విద్యాశాఖపై నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బడిఈడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. వచ్చే నెల 24వ తేదీ వరకు ఆరుబయట ఉన్న పిల్లలు, మధ్యలో మానేసిన విద్యార్థులను పాఠశాలలోనూ, వసతి గృహాల్లోనూ సౌకర్యం కల్పించాలన్నారు. అలాగే గ్రామాల్లో వేసిన కమిటీల ద్వారా విద్యార్థులను గుర్తించి పాఠశాలల్లో చేర్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవోలు శ్రీనివాసరావు, భాస్కరరావు, మహేష్, హెచ్‌ఎంలు, ఎమ్మార్సీ సిబ్బంది పాల్గొన్నారు.

కురుపాం స్నేహకళా సాహితీ రచయితలకు అరుదైన గౌరవం


గౌరినాయుడు, జగదీష్

కురుపాం: కురుపాం స్నేహకళా సాహితీకి చెందిన ఇద్దరు రచయితలు అరుదైన గౌరవం దక్కించుకున్నారు. స్నేహకళా సాహితీ వ్యవస్థాపకుడు, ప్రముఖ రచయిత, కవి గంటేడ గౌరినాయుడు, ఇదే సంస్థకు చెందిన మరో రచయిత మల్లిపురం జగదీష్‌లకు చెందిన కొన్ని రచనలు పాఠ్యపుస్తకాల్లో పాఠ్యాంశాలుగా ఎంపికయ్యాయి. గంటేడ గౌరినాయుడు రాసిన 'పాడుదమా స్వేచ్ఛాగీతం' అనే పాట మహారాష్ట్రలో తెలుగు పాఠ్యాంశంగా గత ఏడాది ఎంపికయ్యింది. ఈ ఏడాది 'పాట' అనే కవిత ఆంధ్రప్రదేశ్‌లో 9వ తరగతి తెలుగు వాచకంలో పాఠ్యాంశంగా ఎంపికయ్యింది. అలాగే 'కట్టండి ప్రాజెక్టులు' అనే కవిత బీఆర్ అంబేద్కర్ విశ్వ విద్యాలయంలో ఎంఏ తెలుగు రెండవ సంవత్సరంలో పాఠ్యాంశంగా ఎంపికయ్యింది. మల్లిపురం జగదీష్ రాసిన 'ఉరులు' అనే కథ తొమ్మిదో తరగతి తెలుగు ఉపవాచకంలో చోటు దక్కించుకుంది. 'శిలకోల' అనేకథ 'దుర్ల' అనే కవితలు ఆంధ్రా యూనివర్శిటీలో ఎంఏ తెలుగు లోను. ఉస్మానియా యూనివర్శటీ దూరవిద్య ఎంఏ తెలుగులో చోటు చేసుకున్నాయి. గంటేడ గౌరినాయుడు తెలుగు ఉపాధ్యాయుడుగా పదవీ విరమణ చెయగా మల్లిపురం జగదీష్ ఆంగ్ల ఉపాధ్యాయుడిగా ప్రస్తుతం కురుపాం గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్నారు.

విత్తనశుద్ధితో అధిక దిగుబడులు

గరుగుబిల్లి: విత్తన శుద్ధితో అధిక దిగుబడులు సాధించవచ్చని ప్రకృతి వ్యవసాయ రీజనల్ తీమోటిక్ లీడ్ కె.ప్రకాష్ తెలిపారు. గురువారం చిలకాం గ్రామంలో ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో వ్యవసాయం చేస్తున్న 30 మంది రైతులతో సామూహిక విత్తన శుద్ధి కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. పెట్టుబడులు తగ్గించి దిగుబడులు పెంచడానికి ఏకైక మార్గం బీజామృతంతో విత్తన శుద్ధి చేయడమని చెప్పారు. ఈ కార్యక్రమంలో రీజనల్ టెక్నికల్ అధికారి జి.హేమసుందర్, స్టేట్ రిసోర్స్‌పర్సన్ పి.దేవుళ్లు, ఎస్ఎఫ్ఏ జి.అన్నపూర్ణ, మండల ఇన్‌చార్జి వి.పోలినాయుడు, రైతులు శంకరరావు, నారాయణరావు, జగదీష్, మంగమ్మ, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ రేషన్ పంపిణీ చేయాలి

కురుపాం: గిరిజన గ్రామాల్లో ఎండీయూ వాహనం ద్వారా ఇంటింటికి రేషన్ పంపిణీ చేయాలని గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి కోలక అవినాష్, సహ కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు, కోశాధికారి ఎం.రమణ ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. కురుపాంలో వారు గురువారం స్థానిక విలేకర్లతో మాట్లాడారు. గిరిజన ప్రాంతంలో 962 రేషన్ డిపోలు ఉండగా మంత్రి సంధ్యారాణి రేషన్ డిపోల వద్ద బియ్యం పంపిణీ చేసేందుకు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తామటం సమంజసం కాదన్నారు. ఎండీయూ వాహనం ద్వారా రేషన్ బియ్యం పంపిణీ చేయాలని కోరారు.

డీలర్ల వ్యవస్థను భ్రష్టుపట్టించారు

పాలకొండ: వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల పాలనలో డీలర్ల వ్యవస్థను భ్రష్టు పట్టించిందని డీలర్ల సంఘ రాష్ట్ర అధ్యక్షుడు లీలామోహన్‌రావు అన్నారు. గురువారం ఆయన స్థానక విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. డీలర్లను వైసీపీ ప్రభుత్వంలో జగన్మోహన్‌రెడ్డి చిన్నచూపు చూశారన్నారు. డీలర్ల సమస్యలను ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. ఈ సమావేశంలో పలువురు డీలర్లు సూర్యారావు, భుజంగరావు తదితరులు ఉన్నారు.

క్లుప్తంగా..

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

భామిని: భామిని సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం కొరమ ఫీడర్ జంగిల్ క్లియరెన్స్ మరమ్మతులు చేస్తున్నందుకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్టు ఏఈ శ్రీనివాసరావు తెలిపారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు భామినితో పాటు లివిరి, బాలేరు, పెద్దదిమిలి, కొరమ తదితర గ్రామాలకు విద్యుత్ సౌకర్యం ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

రైతు నాయకుడు లక్ష్మీనాయుడు మృతి

పాలకొండ: ఏపీ రైతు సంఘం సీనియర్ నాయకుడు బలగల లక్ష్మీనాయుడు గురువారం ఆయన స్వగ్రామం కొండాపురంలో మృతిచెందారు. విషయం తెలుసుకున్న ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బుడితి అప్పలనాయుడు ఆయన కుటుంబాన్ని పరామర్శించి, సంతాపం తెలిపారు. ఆయనతో పాటు రైతు నాయకులు గురుబిల్లి అప్పలనాయుడు, జనార్దనరావు, కిమిడి రామ్మూర్తినాయుడు, వండాన కూర్మారావు, బలగ దుర్గారావు, మజ్జి సన్యాసినాయుడు, పిట్ట రమణ, జడ్డు బాలరాజు పాల్గొన్నారు.

మంత్రికి వినతి

గుమ్మలక్ష్మీపురం: పార్వతీపురం-కూనేరు అంతర్ రాష్ట్ర రహదారికి మరమ్మతులు నిర్వహించేలా అధికారులను ఆదేశించాలని గిరిజన సంక్షేమ శాఖా మంత్రి గుమ్మిడి సంధ్యారాణికి కురుపాం ఎమ్మెల్యే జగదీశ్వరి, టీడీపీ కొమరాడ మండల కన్వీనర్ శేఖర్ పాత్రుడు విన్నవించారు. ఈ మేరకు గురువారం పార్వతీపురం వచ్చిన మంత్రికి వినతిపత్రం అందించారు. తక్షణమే మరమ్మతులు చేపట్టేలా చర్యలు తీసుకుంటా మని ఆమె హామీనిచ్చారు.

రహదారి అభివృద్ధికి ప్రతిపాదనలు

గుమ్మలక్ష్మీపురం: భద్రగిరి-గుమ్మలక్ష్మీపురం రహదారిని వెడల్పు చేయడానికి గిరిజన సంక్షేమశాఖ ఇంజినీరింగ్ అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు. అవసరమైన స్థలాన్ని వర్షం వస్తే బురదగా మారే పరిస్థితులను గుమ్మలక్ష్మీపురం గ్రామ సర్పంచ్ బి.గౌరీశంకరరావు తెలియజేశారు. ప్రతిపాదన సిద్ధం చేసి ఉన్నతాధికారులకు పంపుతామని టీడబ్ల్యూ బద్రి, ఏఈ అప్పారావు తెలిపారు.

ఐసీడీఎస్ పథకాల అమలుపై కళాజాత

గరుగుబిల్లి: ఐసీడీఎస్ ప్రాజెక్టుల ద్వారా అమలు చేస్తున్న పథకాలపై గరుగుబిల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం కళాజాతా నిర్వహించారు. బాలల హక్కులు, చట్టాలు, అంగన్‌వాడీ కేంద్రాల ఆవశ్యకతపై కళాజాత నిర్వహించినట్టు గరుగుబిల్లి, పెదగుడబ, రావివలస సెక్టార్ల సూపర్‌వైజర్లు రౌతు లక్ష్మి, అరుణకుమారి తెలిపారు. పీహెచ్‌సీ సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

మద్యం సీసాల ధ్వంసం

బొండపల్లి: స్థానిక పోలీసు స్టేషన్ పరిధిలో ఈ ఏడాది కాలంలో 18 కేసుల్లో పట్టుకున్న 444 మద్యం సీసాలను గురువారం ధ్వంసం చేశామని ఎస్ఐ కనిరెడ్డి లక్ష్మణరావు తెలిపారు. ఎస్పీ ఆదేశాల మేరకు పోలీసు స్టేషన్ ఆవరణ లో ఎక్సైజ్ అధికారుల పర్యవేక్షణలో మద్యం సీసాలను ధ్వంసం చేశామని చెప్పారు.



